విశాలాంధ్ర చందా వివరాలు

దిన పత్రిక 12 పైసలు; ఆదివారం సంచిక 15 పైసలు

	ఏజెంటు ద్వారా		పోస్ట్ ద్వారా
నెలకు	రు. 3-75	...	రు 4-25
3 నెలలకు	రు. 11-25	...	రు. 12-75
6 నెలలకు	రు. 22-00	...	రు 25-50
సంవత్సరానికి	రు. 44-00	...	రు. 51-00

VISALAANDHRA Phone 6376

ఉదయం

Regd. No. H. 203

విశాలాంధ్ర

సంపుటి 16, సంచిక 375] విజయవాడ 9—4—1967 ఆదివారం [4 పేజీలు 12 పై.

Dept. of Information & Public Relations H

702560

అంబేద్కర ఆయుర్వేద ఫార్మసీ (రిజిష్టర్డు)
-హెడ్డాఫీసు- మారుటేరు ప.గో. జిల్లా
సప్తధాతురసాయనం రక్తవృద్ధి, బలము చేకూర్చు దివ్యమూలికా ఫలరసాయనం 40 రోజులకు రు: 20.00
కల్యాణునకు రాజ ప్రాయంబ!
మూలకంకి వ్యాధిని సొగారుటలో అద్వితీయమయిన ఔషధం నెలకు రు: 8.00 అర్శోహారి
250 సశాస్త్రీయ ఆయుర్వేద ఔషధములు లభించును
ఆంధ్రదేశమంతటా మా బ్రాంచీలు ఏజన్సీలు కలవు

ఆహారపరిస్థితిపై ఢిల్లీలో ముఖ్యమంత్రుల, ఆహారమంత్రులచర్చలు

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య విభేదాలు రేకెత్తే అవకాశం లేకపోలేదని ప్రధాని వెల్లడి

మే 13, 14 తేదీల్లో ప్రదేశ్ వ్యవసాయ కార్మిక 8 వ మహాసభ

హైద్రాబాద్‌లో జరిగిన సన్నాహక సంఘ సమావేశంలో నిర్ణయం

హైద్రాబాద్ ఏప్రిల్ 8

ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ఎనిమిదవ మహాసభను గుంటూరు జిల్లాలో మేనెల 13,14 తేదీలలో జరపాలని ఇక్కడ జరిగిన ఆ మహాసభ సన్నాహక సంఘ సమావేశం వారు తీర్మానించారు. మహాసభ జరిగేవరకు సంఘ కార్యాలయాన్ని తాత్కాలికంగా విజయవాడలో వుంచ నిర్ణయించారు. నూతన సంవత్సరానికి లక్ష యిరవై వేల సభ్యత్వం చేర్చాలని కూడా తీర్మానించారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక 8 వ మహాసభ సన్నాహకసంఘ సమావేశం హైదరాబాద్‌లోని ప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘ కార్యాలయంలో శ్రీ స్వర్ణ వేమయ్య అధ్యక్షతన యీ నెల 5, 6 తేదీలలో జరిగింది. అన్ని జిల్లాల నుండి సభ్యులు హాజరైనారు. ప్రత్యేక ఆహ్వానంపై భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు, ప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ జి. యల్లమందారెడ్డి సమావేశంలో పాల్గొని అమూల్యమైన సలహాల నిచ్చారు.

రెండురోజుల చర్చల అనంతరం యీ క్రింది నిర్ణయాలను చేశారు.

1. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక 8 వ మహాసభను గుంటూరుజిల్లాలో మే 13, 14 తేదీలలో జరపాలని నిర్ణయించ బడింది. భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు, బెంగాల్ ఇరిగేషన్ మంత్రి శ్రీ విశ్వనాద్ ముఖర్జీలను ప్రధాన ఉపన్యాసకులుగా ఆహ్వానించాలని తీర్మానించబడింది. అలాగే పార్లమెంటు సభ్యులు శ్రీ తెన్నేటి విశ్వనాథం, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు శ్రీమతి ఈశ్వరీబాయ్, సంయుక్త సోషలిస్టు పార్టీ నాయకులు శ్రీ బద్రి విశాల్‌పిట్టి, తదితర అభ్యుదయ...

(మిగతా 2 వ పేజీలో)

పుదుచ్చేరి మంత్రివర్గ ప్రమాణస్వీకారంనేడే

మద్రాసు, ఏప్రిల్ 8

5 గురు సభ్యులతో పుదుచ్చేరి లో కాంగ్రెస్ మంత్రివర్గం రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నది.

శాసనసభ కాంగ్రెస్ నాయకుడు శ్రీ ఫరూక్ మరికర్ ఢిల్లీనుండి వచ్చిన అనంతరం పి. టి. ఐ. విలేకరితో మాట్లాడుతూ 5 గురు సభ్యులతో మంత్రివర్గం ఏర్పాటు చేయుటకు కేంద్రం అనుమతించిం దన్నారు. లోగడ మంత్రుల సంఖ్య 4

ఆయన మంత్రుల పేర్లను వెల్లడించడానికి నిరాకరించారు. ఈ రాత్రికి మంత్రుల పేర్లను ప్రకటించగల నన్నారు.

* * *

గమనిక

10-4-67 వ తేదీ విశాలాంధ్ర ఉగాది పండుగ సందర్భంగా 12 పేజీలతో వెలువడుతుంది.

వెల 20 పై.

మేనేజరు, విశాలాంధ్ర.

* * *

నాగార్జున సాగర్ కు అదనపు నిధులు

రాష్ట్ర రైతుసంఘ కార్యవర్గం డిమాండ్

హైద్రాబాద్, ఏప్రిల్ 8

నాగార్జునసాగర్ మొదటిదశ రెండు సంవత్సరాలలో పూర్తిగావడానికి వీలుగా కేంద్రం వెంటనే అదనపు నిధులు కేటాయించాలని నిన్న యిక్కడ సమావేశమైన రాష్ట్ర రైతుసంఘ కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ కార్యవర్గ సమావేశం నిన్న హైద్రాబాదులో జరిగింది. సమావేశానికి శ్రీ బద్దం ఎల్లారెడ్డి (యం. పి.) అధ్యక్షత వహించారు. 17 మంది సభ్యులు 4 గురు ఆహ్వానితులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు శ్రీ వై. వి. కృష్ణారావు మొదట ప్రసంగిస్తూ, మొదటి దశ రెండు సంవత్సరాలలో పూర్తిగావడానికి వీలుగా 20 లక్షల ఎకరాలు సాగుక్రిందకు తీసుకొని రావడానికి వీలుగా నాగార్జున సాగర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

అధికోత్పత్తికి వినియోగించడానికై సీటిని గరిష్ఠస్థాయిలో వుంచడానికివీలుగా, నాగార్జునసాగర్ వంతెన స్పిల్ వే పోర్షన్ మీద గేట్లు నిర్మించాలన్న ప్రతిపాదనను మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

1962 అదనపు భూమిశిస్తు చట్టం చెల్లకేటంటూ సుప్రీంకోర్టు యిచ్చిన తీర్పు ఫలితంగా యేర్పడిన పరిస్థితిని గురించి ఆయన వటంక్షించారు. మొత్తంగా భూమి శిస్తు సమస్యను సమీక్షించకుండా రైతుల మీద కొత్త భారాన్ని విధించవద్దని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు.

ఎరువుల పంపిణీలో జరుగుతున్న లోపాలను ఆయన విమర్శించారు. అలాగే రసాయనిక యెరువుల పంపిణీలో జరుగుతున్న ప్రస్తుత బ్లాక్ మార్కెట్టు విధానాన్ని ఆయన ప్రస్తావించారు. షావాలెస్, ప్యారీ కంపెనీ, తదితర ప్రయివేటు సంస్థలచేత భాస్వరపుయెరువులనుపంపిణీ చేయించడంలో స్వేచ్ఛా వ్యాపారానికి అనుమతి యివ్వవద్దని శ్రీ కృష్ణారావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్రీమతి విమలాదేవి మృతికి సంతాపం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ సభ్యురాలు శ్రీమతి విమలాదేవి అకాలమరణానికి కార్యవర్గం సంతాపం తెలుపుతూ తీర్మానించింది.

1962 అదనపు భూమిశిస్తు చట్టం క్రింద వసూలుచేసిన అదనపు మొత్తాలు వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తీరా

(మిగతా 3 వ పేజీలో)

మారకద్రవ్య అజమాయిషీ శాఖ

బ్యాంక్ ఉద్యోగుల మహాసభలో డా॥ రాజ్‌బహదూర్‌గౌడ్ డిమాండ్

హైద్రాబాద్, ఏప్రిల్ 8

మారక అవసరాలకు సంబంధించి రాష్ట్ర ప్రజలు మద్రాసుపోయి యిబ్బంది పడుతున్న దృష్ట్యా మన రాష్ట్రంలో వెంటనే మారక అజమాయిషీ డిపార్టుమెంటును స్థాపించడానికై భారత రిజర్వుబ్యాంకుపై వత్తిడి తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని శ్రీ రాజబహదూర్‌గౌడ్ చెప్పారు.

భారత రిజర్వుబ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ 11 వ వార్షిక మహాసభలో ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ నిన్న యీ విషయం చెప్పారు.

ఆంధ్ర బ్యాంక్ భవనం నాలుగవ అంతస్తులో యీ మహాసభ జరిగింది.

రాష్ట్ర కార్మిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ బాపూజీ యీ మహాసభను ప్రారంభించారు.

మారక అజమాయిషీ శాఖను యేర్పాటు చేయడానికి తాను అన్నిచర్యలు తీసుకొంటాననీ, హైద్రాబాద్‌లో పూర్తి కాలం పని చేసే కార్యాలయాన్ని యేర్పాటు చేయిస్తామని శ్రీ లక్ష్మణ్ బాపూజీ అన్నారు.

దేశం క్లిష్ట పరిస్థితిలో వుందని, అన్ని పరిశ్రమలలోనూ శాంతి నెలకొనాల్సిన అవసరం వుందని ఆయనఅన్నారు. కార్మిక సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలనీ ఉభయపక్షాల మధ్య పరస్పర అవగాహన వుండాలని ఆయన అన్నారు. ఈ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ పి. కృష్ణారెడ్డి నివేదిక యిచ్చారు.

రూపాయి విలువ తగ్గిన కారణంగా తలెత్తిన సమస్యలు, మేనేజరు కార్మిక వ్యతిరేకవైఖరి ఆయన శీ సహేతుమైనప్రమోషన్ విధానాన్ని ప్రస్తావించారు. సిబ్బందికి హెడ్ క్వార్టర్స్ ఆఫీస్ భవనం నిర్మించాలని ఆయన అన్నారు.

హైద్రాబాద్ స్టేట్‌బ్యాంక్ సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు, శ్రీ రాఘవులు, భారత స్టేట్ బ్యాంక్‌సిబ్బంది యూనియన్ సంయుక్త కార్యదర్శి శ్రీ లక్ష్మీనరసయ్యా సౌహార్ద సందేశాలిచ్చారు.

శ్రీ గౌడ్ తనప్రసంగాన్ని ముగిస్తూ కార్మికులు తమ లక్ష్యాన్ని సాధించు కొనడానికి వీలుగా అన్ని కార్మిక సంఘాలు వివిధ రాజకీయ విశ్వాసాలు అభిప్రాయాలున్న వ్యక్తులు ఒకే ట్రేడ్ యూనియన్‌లో వుండి పోరాడాలని అన్నారు.

వచ్చే సంవత్సరానికి యీ క్రింది వారు ఆఫీసు బేరర్లుగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడు, శ్రీ రాజబహదూర్ గౌడ్, ఉపాధ్యక్షుడు, శ్రీ కె. వి. భద్రయ్య, కార్యదర్శి శ్రీ కృష్ణారెడ్డి సహాయక కార్యదర్శి శ్రీ పి. రామచంద్రరావు సహాయక కార్యదర్శి శ్రీ చక్రపాణి కోశాధికారి శ్రీ పాండురంగారావు.

బీహార్ ప్రభుత్వానికి సర్వత్రా అండదండలు

పాట్నా, ఏప్రిల్ 8

బీహార్ ఆర్థిక మంత్రి శ్రీ కర్పూరీ ఠాకూర్‌కు బెగుసరాయిలోని అయోధ్య శివకుమారి ఆయుర్వేద కాలేజీ ప్రిన్సిపాల్ జ్ఞానయక్ ఐహూ గుణ 8 రూపాయల 40 నయాపైసలను మనియార్డర్ చేశారు. 1966-67 సంవత్సరానికి రాష్ట్ర లోటు బడ్జెటును పూడ్చడానికి తన విరాళం అందుకోవలసిందిగా తెలియజేస్తూ యీ చిన్న మొత్తాన్ని పంపించారు.

శ్రీ బహుగుణ ఆర్థికమంత్రికి ఒక లేఖ వ్రాస్తూ, నూతన ప్రభుత్వ కార్యకలాపాల పట్ల తాను యెంతో మురిసిపోయాననీ, నూతన ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నదనీ, దాని బరువు బాధ్యతలో పంచుకోవడం బాధ్యతగా గుర్తిస్తున్నానని ఆయన తెలిపారు.

ఈ మొత్తాన్ని ఆర్థికమంత్రి ట్రెజరీలో డిపాజిట్టు చేశారు.

ఆగ్నేయ రైల్వేలో రైళ్ళ రాకపోకలకు అంతరాయం

కలకత్తా, ఏప్రిల్ 7

నేటి ఉదయం ఆగ్నేయ రైల్వేలోని ఖర్గ్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్సుకు ఎదురుగా ప్రజలు బైఠాయించడంతో ఆ సెక్షన్‌లోని రైళ్ళు నేడు నిలిచిపోయాయి.

అయినప్పటికీ పరస్పర సంప్రదింపులద్వారా పరిష్కరించుకోవచ్చునని ఆశాభావం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

నేటి ఉదయం ఇక్కడ ప్రారంభమైన రాష్ట్రాల ముఖ్యమంత్రుల, ఆహార మంత్రుల సమావేశంలో గంటా 45నిమిషాల పాటు ప్రధానంగా దేశ ఆహార పరిస్థితిని గురించి చర్చ జరిగింది

ఈ సమావేశాన్ని ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ప్రారంభిస్తూ కేంద్రం, రాష్ట్రాలలో విభిన్నరాజకీయ సిద్ధాంతాలు గల ప్రభుత్వాలు ఏర్పడినందున కేవలం ప్రత్యేక సమస్యలుగాని, కొత్త సమస్యలుగానీ ఉత్పన్నం కాలేదన్నారు.

కేంద్ర రాష్ట్రాల మధ్య విభేదాలు వచ్చే అవకాశం లేక పోలేదన్నారు. అయితే ఈ విభేదాలను చర్చల ద్వారా, సంప్రదింపుల ద్వారాపరిష్కరించుకోవాలని ఆమె అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర రాష్ట్రసంబంధాలకు అవినాభావ సంబంధం వుంటుందని అన్నారు.

భారతదేశంలో జరుగుతున్న శాంతియుత రాజకీయ పరిణామానికి, యుద్ధానంతర చరిత్రలో కొద్ది ఉదాహరణలు మాత్రమే కలవని ప్రధానమంత్రి అన్నారు.

ఆ విజయాన్ని గుర్తించడం అవసరమనీ, తద్వారా బలాన్ని పుంజుకోవాలనీ చెప్పారు. భారత ప్రజాస్వామ్యం, ఫెడరలిస్టు వ్యవస్థ ఒక దశకు వచ్చాయి. ఓటరు బాధ్యతను, పరిణత బుద్ధిని ప్రదర్శించారు. ప్రత్యామ్నాయాలు ఏర్పడ్డాయి స్వేచ్ఛగా వెలిబుచ్చిన అభిప్రాయాలే ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక.

మార్పుచెందిన రాజకీయ స్వరూపమే ప్రజాస్వామ్యంపట్ల మన వైఖరికి గుర్తు అని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్యగల సంబంధాల్ని గురించి పేర్కొని, కేంద్రంలోను, రాష్ట్రాల్లోను విభిన్న రాజకీయ దృక్పథాలుకల ప్రభుత్వాలు ఉన్నందువల్ల ప్రత్యేకమైన, నూతన సమస్యలేవీ తలెత్తలేదని అన్నారు.

ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సంబంధాలు అంతర్నిహితమై వున్నాయనీ, భారతదేశంవంటి పెద్ద అభివృద్ధిపొందుతున్న ఫెడరల్ వ్యవస్థకల దేశంలో స్థానిక, ప్రాంతీయ ప్రయోజనాలు స్వాభావికంగానే వుంటాయనీ అన్నారు.

అభిప్రాయభేదాలకు గల అవకాశాన్ని ఆమె త్రోసిపుచ్చలేదు. అటువంటి అభిప్రాయ భేదాల్ని సంప్రతింపులద్వారాను, చర్చలద్వారాను, ఒకర్ని ఒకరు వొప్పించడం చేయడం ద్వారాను పరిష్కరించుకోవచ్చునని ఆమె చెప్పారు.

మన మిత్రదేశాలు మనకు కోటిటన్నుల ఆహారధాన్యాలు యిస్తామని వాగ్దానం చేసినా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆహార ధాన్యాలను పొదుపుగానే కేటాయించవలసి వుందని కేంద్ర ఆహారమంత్రి జగ్‌జీవనరాం చెప్పారు. దేశం అంతటా ధాన్యసేకరణను కొనసాగించవలసిన అవసరం వుందని ఆయన నొక్కిచెప్పారు. మిగులు రాష్ట్రాల్లోనే కాకుండా, తరుగు రాష్ట్రాల్లోని మిగులు ప్రాంతాల్లో కూడా ధాన్యసేకరణ అమలు జరపాలన్నారు.

వీలు లభించే ప్రతిచోటా వేసవిలో పిదప పంటలు పండించాలి. వ్యవసాయానికి సంబంధించిన యితర రంగాలనుండి నిధులను ఖర్చుపెట్టి అయినా మైనరు ఇరిగేషన్ పథకాలను అమలుపరచాలని చెప్పారు.

ఆహార సమస్యపై జరిగిన చర్చలో గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, ఒరిస్సా ముఖ్యమంత్రులు, పశ్చిమ బెంగాల్ ఆహారమంత్రి పాల్గొన్నారు.

ఆహార సమస్యపై చర్చలు మధ్యాహ్నం 3-30 గంటలకు జరిగే సమావేశంలో తిరిగి కొనసాగుతాయి

రాజస్థాన్ మంత్రులు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆహార మంత్రులు సమావేశానికి హాజరయ్యారు. రాజస్థాన్ నుండి గవర్నరు సలహాదారు, ప్రధాన కార్యదర్శి హాజరయ్యారు. కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యారు.

ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడు అశోక మెహతా, ప్రణాళికాసంఘ సభ్యుడు తర్లోక్ సింగ్, మంత్రివర్గ కార్యదర్శి డి యస్. జోషి, తదితర కేంద్ర ప్రభుత్వ అధికార్లు, రాష్ట్ర ప్రభుత్వాల అధికార్లుకూడా సమావేశానికి హాజరయ్యారు.

జంటనగరాలలో

ఆర్. టి. సి కార్మికుల నిరశనదీక్ష విరమణ

30శాతంతాత్కాలిక భృతిసాధనకు నిరవధిక సమ్మె తప్ప మార్గంలేదని శ్రీ మక్దుంప్రకటన

హైద్రాబాద్, ఏప్రిల్ 8

ముప్పైశాతం తాత్కాలిక భృతి యివ్వాలన్న సహేతుకమైన డిమాండ్‌ను సాధించుకోవడానికి ఆర్. టి సి కార్మికులు నిరవధిక సమ్మెకు సిద్ధంగావడంతప్ప మరో మార్గంలేదని హైద్రాబాద్‌లో ఆర్. టి సి కార్మికులు తమ నిరాహారదీక్ష విరమించిన సందర్భంగా 2 వేలమంది హాజరైనసభలో ప్రసంగిస్తూ ఆర్. టి.సి ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు శ్రీ మక్దూం మొహియుద్దీన్ నేడు స్పష్టం చేశారు.

ఆర్. టి. సి. కార్మికులు 30 శాతం తాత్కాలికభృతి డిమాండ్ చేస్తూ ముషీరాబాద్‌లోని సెంట్రల్ వర్క్‌షాపు ముందు నిరాహారదీక్ష కొనసాగించిన ఏ. పి. యస్ ఆర్.టి. సి.కార్మికులయూనియన్ కోశాధికారి శ్రీ ఆంబ్రూ జోసెఫ్ వారి 12 మంది కార్మికులు నేడు మధ్యాహ్నం 12 గంటలకు దీక్ష విరమించారు.

ఆర్. టి. సి. ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు, శ్రీ మక్దూం మొహియుద్దీన్ వారికి నిమ్మరసం యిచ్చిన తర్వాత వారు దీక్ష విరమించారు. సెంట్రల్ వర్క్‌షాపు సెంట్రల్ స్టోర్సుకు చెందిన 2 వేలమంది కార్మికుల సభలో శ్రీ మక్దూం వారికి యీ నిమ్మరసం యిచ్చారు. శ్రీ మక్దూం దీక్షవరులకు పూలమాలలు వేశారు.

వర్క్‌షాపులోని యితర విభాగాల ప్రతినిధులుగూడా వీరికి పూలమాలలు వేశారు

ఆంబ్రూ జోసెఫ్ యీ నెల నాలుగునుండి నిరాహారదీక్ష జరిపారు. మిగతవారు తర్వాత నిరాహారదీక్షకొనసాగించారు.

ఈ సందర్భంగా, శ్రీ మక్దూం మొహియుద్దీన్ ప్రసంగిస్తూ, 16 వేల మంది ఆర్. టి. సి. కార్మికులకొరకై యీ నిరాహార దీక్షలు జరిపిన వారిని అభినందించారు.

ఆర్. టి. సి. మేనేజ్‌మెంటు, ఆర్. టి. సి. కార్మిక యూనియన్ మధ్య ఇంతవరకూ జరిగిన సంప్రదింపులలో యెలాంటి ప్రగతి సాధించని ఫలితంగా, 30 శాతం తాత్కాలిక

(మిగతా మూడవ పేజీలో)

కంట్రోలు వస్త్రాల ధరల హెచ్చింపుకు త్వరలో నిర్ణయం

రాజ్యసభలో డిప్యూటీ వాణిజ్యమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

కంట్రోలు విధించబడిన వస్త్రాల ధరలను పెంచుతూ ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకోవచ్చునని నేడు రాజ్యసభలో వాణిజ్యశాఖ డిప్యూటీమంత్రి మహమ్మద్ షఫీఖురేషీ సూచనప్రాయంగా తెలియజేశారు.

వస్త్రాల ధరలను 6 శాతం పెంచడానికి ప్రభుత్వం యిదివరకే నిర్ణయం తీసుకుని, పార్లమెంటు సమావేశంలో వుండగా దాన్ని ప్రకటించాలని కోరడం లేదా అని శ్రీ బాబూభాయి ఎం. చినాయ్ వేసిన అవ్యవధి ప్రశ్నకు ఖురేషీ పై సమాధానం చెప్పారు.

ప్రభుత్వం నిర్ణయం చేస్తే, ప్రకటించడానికి సిగ్గుపడదనీ, కొద్ది రోజుల్లో నిర్ణయం చేస్తామనీ అన్నారు.

మరో ఐదు లక్షల బేళ్ళ పత్తిని అమెరికా, ఐక్య అరబ్ రిపబ్లిక్, సూడాన్‌ల నుండి జూన్ ఆఖరులోగా దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుకూడా ఆయన చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో ఫైళ్ళ అపహరణ

ప్రభుత్వం ప్రకటనచేయాలని రాజ్యసభలో శ్రీ భూపేష్ డిమాండ్

న్యూఢిల్లీ. ఏప్రిల్ 7

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ మాజీ ముఖ్యమంత్రి శ్రీ సి. బి. గుప్తా కేసుకు సంబంధించిన కొన్ని ఫైళ్ళను లక్నోలోని సచివాలయ కార్యాలయం నుండి అపహరించేందుకు జరిగిన ప్రయత్నంపై ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపేష్ గుప్తా నేడు రాజ్యసభలో డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు అపారంగా కంపెనీనిధులు

లోక్‌సభలో పారిశ్రామికాభివృద్ధి మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

1966 మార్చి 1 నుండి 1967 ఫిబ్రవరి 28 వరకు వివిధ కంపెనీల లాభనష్టాల అకౌంటు ప్రకారం వివిధ పార్టీలకు ఇచ్చిన నిధుల వివరాలను కేంద్ర పారిశ్రామికాభివృద్ధి మంత్రి శ్రీ ఫకృద్దీన్ ఆలీ అహ్మద్ నేడు లోక్‌సభలో ప్రకటించారు.

ఈ ప్రకటన ప్రకారం అత్యధిక మొత్తాన్ని కాంగ్రెస్‌పార్టీ పుచ్చుకున్నది. కాంగ్రెస్ రు. 6,27,533, స్వతంత్రపార్టీ 13,320, జనసంఘ్ రు 2,438, పి యస్.పి రు 2030, యస్. యస్. పి రు. 1,021, ఐ. యన్. టి యు. సి. రు. 500. హిందూ మహాసభ రు. 21 అకాలీదళ్ రు. 10.

ప్రధానమంత్రి డార్జిలింగ్ సందర్శన

సింగరి (పశ్చిమ బెంగాల్) ఏప్రిల్ 8

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధి ఏప్రిల్ 13 న డార్జిలింగ్‌ను సందర్శిస్తారని ఇక్కడికి అధికారయుతంగా తెలిసింది.

ఆమె డార్జిలింగ్‌లో 7 రోజులు వుంటుంది. గాంగ్‌టాక్‌నుకూడా సందర్శిస్తుందని భావిస్తున్నారు.

ఆర్థిక బిల్లుపై చర్చ:

‘సర్వతోముఖ’దుబార దుర్వ్యయాలు

ఈనాటికీ అడ్డు, అదుపు లేకుండా సాగుతున్నవని లోక్‌సభ చర్చలో సభ్యుల విమర్శ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికీ కొంత మేరకు పన్నులు తగ్గించాల్సిన అవసరం వుందనీ, అయితే అలాంటి సూచనలేమీ కనపడడంలేదని, బదులుగా దుర్వ్యయం దుబారా, అన్ని రంగాలలోనూ జరుగుతున్నదని 1967 సంవత్సరానికి సంబంధించి ప్రస్తుత పన్నుల స్వరూపాన్ని కొనసాగించే ఆర్థిక బిల్లుపై చర్చను ప్రారంభిస్తూ స్వతంత్ర సభ్యుడు పిలూ మోడీ నేడు లోక్‌సభలో విమర్శించారు.

ఈ బిల్లుపై నేడు లోక్‌సభలో చర్చ ప్రారంభం అయింది.

ఈ బిల్లుతో ఆదాయపు పన్ను ఆదాయపు పన్ను చట్టం క్రింద చేయవలసిన వార్షిక డిపాజిట్ల రేట్లను కొనసాగించే విషయమై కొన్ని సవరణలు చేస్తారు.

తిరుగుబాటు వాదులను సంతృప్తి పరచాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి యేర్పడిన దృష్ట్యా, పరిపాలనా వ్యయానికి మరింత ధనం ప్రభుత్వం ఖర్చుపెడుతున్నదని ఆయన అన్నారు. మహారాష్ట్రలో 25 మంది మంత్రులతోనూ రాజస్థాన్‌లో 24 మంది మంత్రులతోనూ మంత్రివర్గం యేర్పడగా, మద్రాసులో 8 మందితోనూ, ఒరిస్సాలో 14 మందితోనూ మంత్రివర్గాలు యేర్పాటు చేయబడినాయని, తిరుగుబాటు కాంగ్రెస్ వాదులను సంతృప్తి పరచడానికి యీ విధంగా అధిక సంఖ్యలో మంత్రివర్గాన్ని యేర్పాటు చేసి, ధనం విపరీతంగా ఖర్చు చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

గత కేంద్ర మంత్రి వర్గంలో 57 మంది మంత్రులున్నారనీ, యింత పెద్ద మంత్రివర్గం దుబారాకే ఉపయోగపడిందని ఆయన అన్నారు.

వ్యవసాయానికి అధికతర ప్రాధాన్యం ఇస్తామని ప్రధానులు, ఆర్థికమంత్రులందరూ చెబుతారుగాని యిది పంచవర్ష ప్రణాళికలో మాత్రం ప్రతిబింబించడంలేదని అన్నారు.

కేంద్రంలో ప్రభుత్వం యెన్నాళ్ళోవుండబోదని ఆయన హెచ్చరించారు.

52 పేకముక్కలతో కేంద్ర మంత్రివర్గం యేర్పడిందని. అందులో జోకర్‌గా వుండేందుకు మంత్రివర్గంలో చేరడానికి వీలుగా. కాంగ్రెస్ లాబీలలోని ప్రతివారు ముందుకు చూస్తున్నారని అన్నారు.

సముద్రంలో కృత్రిమ దీవుల సృష్టికి పథకం

బారో - ఇన్ - ఫర్నెస్

(వాయువ్య ఇంగ్లాండ్), ఏప్రిల్ 8

అట్లాంటిక్ సముద్రానికి వంతెన కట్టడానికై కృత్రిమ దీవుల సృష్టికి సంబంధించిన ఒక పథకాన్ని బ్రిటిష్ రక్షణ ఎరికరాలశాఖా మంత్రి రాయ్‌మాసన్ నిన్న ఇక్కడ సందర్శించారు.

బ్రిటన్‌లోని వైకర్స్ కార్పొరేషన్ ఈ పథకాన్ని రూపొందించింది.

ఈ కృత్రిమ దీవులు వాతావరణాన్ని తెలిపే నౌకలకార్యక్రమాన్ని నిర్వర్తించగలవనీ, వైమానిక మార్గాలను కంట్రోలు చేయడంలో తోడ్పడగలవనీ, హెలికాప్టర్లు దిగడానికి వేదికలుగా ఉపకరించగలవనీ ఈ కంపెనీ ప్రతినిధి ఒకరు చెప్పారు.

కృత్రిమ దీవుల వ్యాసం వంద అడుగులు (34మీటర్లు): లోతు 400 అడుగులు (120 మీటర్లు) వుంటుందని అతడు చెప్పారు. ఇవి ఎలాంటి సముద్రంలో నైనా ప్రయాణించి 2 వేల నిలువులలోతు నీటిలో స్థిరంగా కదలకుండావుండగలవని అతడు చెప్పారు. అట్లాంటిక్ సముద్రానికి వంతెన కట్టడానికి ఇలాంటి ఐదు కృత్రిమదీవులు చాలునని పేర్కొన్నాడు.

ఈ పథకానికి ప్రభుత్వం అనుమతిస్తే 2½ సంవత్సరాలలోనే ఇవి సిద్ధం కాగలవని ఆయన అన్నారు.

రాష్ట్రపతి పదవికి

శ్రీ కోకా సుబ్బారావు పోటీ అనివార్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

కాంగ్రెసు అభ్యర్థి ఎవరయినప్పటికీ రాష్ట్రపతి పదవికి శ్రీ కోకాసుబ్బారావుపోటీ అనివార్యమని తెలుస్తున్నది.

కాంగ్రెస్‌పార్టీ తన అభ్యర్థి ఎవరో ఇంత వరకూ నిర్ణయించ లేదు.

రాష్ట్రపతి అభ్యర్థిత్వంపై నిర్ణయాన్ని తీసుకొనేందుకు కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజ్, ప్రధాన మంత్రి ఇందిరాగాంధీల మధ్య ఇంత వరకూ సమావేశం జరగలేదు.

ప్రధాన మంత్రి నేడు మధ్య ప్రదేశ్ ముఖ్య మంత్రి శ్రీ డి. పి. మిశ్రాను కలుసుకున్నారు. రేపిక్కడ ముఖ్య మంత్రుల సభ జరగనున్న దృష్ట్యా ఆమె ఈ విషయమై ఇతర ముఖ్య మంత్రులతోనూ సంప్రదింపులు జరుపు తారని భావింప బడుతున్నది.

రేపు సాయంత్రం ప్రతిపక్ష నాయకులతో ప్రధాన మంత్రి జరుపనున్న సమావేశానికి ప్రాధాన్యత ఉన్నదని ఇక్కడ రాజకీయ వర్గాలవారు భావిస్తున్నారు.

ప్రతిపక్ష అభ్యర్థులయిన శ్రీ సుబ్బారావు (రాష్ట్రపతి) శ్రీ అలీయావర్ జంగ్ (ఉప రాష్ట్రపతి)లు పార్లమెంటరీ బోర్డుకు అంగీకృతం కాదనీ, అందువల్ల ప్రతిపక్ష నాయకులతో సమావేశం జరుపటంద్వారాఉపయోగం లేదని రెండురోజుల క్రితం చెప్పారు.

ఇందువల్ల ఏకాభిప్రాయం అసంభవమని భావింపబడుతున్నది.

శ్రీమతి ఇందిరా గాంధీతో సమావేశం జరపటం వల్ల ఉపయోగమేమీ లేదనీ, ఇందుకు కాంగ్రెసు వైఖరి దోహదకారిగా లేకపోవటమే కారణమని ప్రతిపక్ష నాయకులు భావిస్తున్నారు. ప్రతిపక్షాల అభిప్రాయాన్ని తెలుపుతూ ఆమెకు వ్రాసిన లేఖకు సమాధానం కూడా లేదనివారుచెప్పారు.

శ్రీయుతులు యస్. ఎ. డాంగే, మధులిమాయే, యం. ఆర్. మసానీ, ఎ. బి. వాజ్‌పాయ్, అనందన్ నంబియార్‌లు నేడు శ్రీ కోకా సుబ్బారావును కలుసుకున్నారు.

కోకా సుబ్బారావుతో ప్రతిపక్ష నాయకుల సమావేశం

రాష్ట్రపతి పదవికి పోటీ విషయమై తుది నిర్ణయానికి రెండు రోజులు వ్యవధి కావాలని శ్రీ సుబ్బారావు

న్యూఢిల్లీ ఏప్రిల్ 7

రాష్ట్రపతి పదవికి పోటీ చేయటమా లేదా? అనే సమస్యపై తాను తుదినిర్ణయానికి వచ్చేందుకు రెండు రోజులు వ్యవధి కావాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావు ప్రతిపక్షాల నాయకులను కోరారు.

నేడు ప్రతిపక్షాలనాయకులు నేడు శ్రీ కోకా సుబ్బారావును కల్సుకొని రాష్ట్రపతి పదవికి పోటీచేయవలసిందిగా అభ్యర్థించారు.

ప్రతిపక్షాల నాయకుల అభ్యర్థనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి త్రోసిపుచ్చరనే ఆశాభావాన్ని శ్రీ మసానీ వ్యక్తం చేశారు.

మరో రెండు నామినేషన్లు దాఖలు

రాష్ట్రపతి పదవికి నేడు మరో రెండు

(మిగతా 3 వ పేజీలో)

విశాలాంధ్ర

గుత్త పెట్టుబడిదారుల కబంధ హస్తాలు

ఈనాడు నిజంగా ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగం అంటూ ఒకటి నడుస్తున్నదా? లేక ఎక్కడి కక్కడ స్వార్థపరవర్గాలు వారి బంట్లు ప్రభుత్వాధికారాన్ని తమ కిచ్చవచ్చిన రీతిని తమ చెప్పు చేతలలో పెట్టుకొని నడిపిస్తున్నారా?

ఈ విషయం ఆనాటి కానాడు అతి నికృష్టస్థితి దాల్చుతూంది. ప్రభుత్వం చెప్పే విధానాలు, జారీ చేసే ఫర్మానాలు కాగితాల మీదనే ఉంటున్నాయి. పలుకుబడి గల్గిన వర్గాలు తమ ప్రయోజనాలను యథేచ్ఛగా నెరవేర్చుకుంటున్నాయి

ఇందుకు మచ్చు తునకలన దగిన రెండు ఉదంతాలు ఇటీవలనే వెలుగులోకి వచ్చాయి.

భారత బారెల్-డ్రమ్ ఉత్పత్తి కంపెనీ - దగాకోరు కంపెనీ అనీ, ఆ కంపెనీని వాడరాదనీ భారత ప్రభుత్వం 1964 లో ఒక ఉత్తర్వు జారీ చేసింది. కాని ఆ ఉత్తర్వు ఉత్తర్వులాగానేఉన్నది 1964ఫిబ్రవరినుండి 1966మార్చివరకు రు 77 లక్షల 26 వేల కిమ్మతుగల పీపాలను, డ్రమ్ములను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈ కంపెనీ వద్ద ఖరీదు చేసింది. అంతేకాక ఈ "దొంగ" కంపెనీకి కావలసిన లైసెన్సులు, కోటాలు యథావిధిగా మంజూరవుతున్నాయి కాని నిలిపివేసినట్లు ఎక్కడా కనబడదు

ఈ విషయమై ఇటీవల లోక్‌సభలో ప్రతిపక్షసభ్యులు, పెట్రోలు రసాయన శాఖామంత్రి శ్రీ అశోక్ మెహతాను నిగ్గదీస్తే, బైటపడిన వింతలు - విశేషాలు చాలా ఆశ్చర్యకరంగా ఉన్నాయి. అసలు వివిధ ప్రభుత్వ శాఖలలోపెట్టుబడిదారీవర్గ ఏజంట్లు ఏ విధంగా స్వైరవిహారంచేస్తున్నారోఫైళ్ళలో కాగితాలు, కొన్ని కొన్ని సందర్భాల్లో ఫైళ్ళకు ఫైళ్ళు ఏవిధంగా అదృశ్యం చేస్తున్నారో బైటపడింది భారత - బారెల్ - డ్రమ్ కంపెనీని బ్లాక్ లిస్టులో చేర్చినట్లు ప్రభుత్వం పంపిన ఉత్తర్వు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు ముట్టినట్టు రికార్డులలో ఉంది కాని ఉత్తర్వు ఎంత వెతికినా ఫైళ్ళలో లేదు. నిషిద్ధ కంపెనీతో పైన చెప్పిన విధంగా ప్రభుత్వ నూనె సంస్థ అధికారులు లావాదేవీలు జరుపుతూనే ఉన్నారు.

మరో విడ్డూరమైన విషయం ఏమంటే ప్రభుత్వం ఒక వేళ అట్టి ఉత్తర్వు జారీ చేసినా ఆ ఉత్తర్వును ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అమలు జరపాలనే నిబంధన ఎక్కడా లేదనీ, కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన బ్లాక్ లిస్టును ప్రభుత్వ రంగంలో సంస్థలన్నీ అమలు జరపాలన్న నిర్ణయం 1966 జనవరి వరకు జరగలేదని అందుచే భారతబారెల్-డ్రమ్ ఉత్పత్తి కంపెనీతో లావాదేవీలు కొనసాగించడంలో ఆక్షేపణలేదనీ మంత్రివర్యుని కుంటి వాదన.

ఇదంతా చూస్తే ప్రభుత్వ ఉత్తర్వులకు ప్రభుత్వ యాజమాన్యంగల సంస్థలలోనే ఎటువంటి గతి పడుతూందో తేటతెల్లమవుతూంది.

ఈ సమస్యపై ప్రతిపక్షాలు అడిగిన ఒక ప్రశ్నకు స్పీకరు శ్రీ సంజీవరెడ్డి అనుమతించలేదు భారత బారెల్ - డ్రమ్ కంపెనీ. కాంగ్రెస్ ఎన్నికలనిధికి పెద్ద మొత్తాలు యిచ్చినందునే ఈ ఉదాసీనత ప్రదర్శించబడుతున్నదా? అన్నదే ఆ ప్రశ్న.

కాంగ్రెస్ పాలకుల గుట్టుబైట పెట్టే ఈ ప్రశ్నను అనుమతించక పోవడంలోనే ఈ ఉదంతంలో తెర వెనుక రహస్యం ఏమిటో తెలిసి పోతూంది

పనికి మాలిన దొంగ కంపెనీలకు లక్షల కొలది ప్రజల ధనాన్ని కట్టబెడుతున్న ఈ ఉదంతం కంటె మరీ ఘోరమైనది యించుమించు గత దశాబ్దమంతా యావత్తు ప్రభుత్వ పారిశ్రామిక లైసెన్సులను ఒకేఒక బడా కంపెనీకి దారాదత్తం చేసిన విషయం.

1957 - 66 మధ్య తొమ్మిది సంవత్సరాలలో అత్యధిక సంఖ్య లైసెన్సులను భారత గుత్త పెట్టుబడిదారులలో అగ్రగణ్యులైన బిర్లా కుటుంబం కాజేసినట్లు ఇటీవలనే బైటపడింది.

బొంబాయి పారిశ్రామిక ఆర్థిక వేత్త డాక్టర్ ఆర్. కె హజారే ఈ లైసెన్సుల గురించి ప్రణాళికా సంఘానికి సమర్పించిన నివేదిక బైటపెట్టడానికి ప్రభుత్వం సవాలక్ష కుంటిసాకులు చెప్పింది. చివరకు కాంగ్రెస్ సభ్యులు కూడా ఈ దారుణమైన కుంభకోణాన్ని ఎదుర్కొంటూ ఈ నివేదికనుబైటపెట్టాలని డిమాండ్ చేశారు గత్యంతరంలేక ఏప్రిల్ 7 వ తేదీన పరిశ్రమల మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీఅహమ్మద్, రాజ్యసభకు ఈ నివేదిక సమర్పించారు

ఈ నివేదిక వివరాలు చూస్తే బిర్లాలు ఎంత "అమోఘ"మైన ఎత్తుగడలు అవలంబించి రకరకాల పారిశ్రామిక లైసెన్సులను ఏఇతర కంపెనీలకు కూడా దక్కకుండా గుత్తకు పుచ్చుకుంటున్నారో స్పష్టమవుతోంది ఆ యా సరకుల ఉత్పత్తి రంగంలో మరొకరికి స్థానంలేకుండాచేసేటంతగా గుత్తాధిపత్యాన్ని ప్రభుత్వ లైసెన్సింగ్ శాఖలు బిర్లా కంపెనీలకు ఎందుకు అనుమతించాలి? ఆ యా శాఖా మంత్రులు దీనిని ఎందుకు తనిఖీ చేయలేదు? మంత్రులకు తెలియకుండా ఇదంతా ఏవిధంగా సాధ్యమైంది? పై పెచ్చు లైసెన్సింగ్ కమిటీకి, కేపిటల్ గూడ్సు కమిటీకి తెలిసికొన్ని, తెలియకుండా మరికొన్ని అనేక లైసెన్సులను ఆమోదించి వేయడం ఏవిధంగా జరిగింది?

ఈ అన్నిటినిబట్టి చూసినప్పుడు నేడు వాస్తవంగాఅధికారం వహిస్తున్నది ఈ బడా పెట్టుబడిదారులు వారి ఏజంట్లు తప్ప, ప్రభుత్వ యంత్రాంగానికి ఎట్టి స్వతంత్ర నిర్ణయాధికారం లేదనీ నేటి దేశ ఆర్థిక వ్యవస్థను గుత్తపెట్టుబడదార్ల కబంధ హస్తాలకు కాంగ్రెస్ పాలకులు అప్పగిస్తున్నారనీ స్పష్టమవుతూంది

కనుకనే కాంగ్రెస్ పాలన అంతంకానిదే ఈ దేశానికి మోక్షం లేదని ప్రజలు తమ అనుభవంలో గుర్తించారు దేశంలో సగం భాగం పైగా కాంగ్రెస్ దుష్టపాలన నుండి విముక్తి చేశారు ఈ పరిణామం సత్వరం పూర్తి అవడం - నేటి కాంగ్రెస్ పాలనా విధానాలు బట్టిచూస్తే ఎంతో దూరంలోలేదు

రాయదుర్గం సమితి అధ్యక్షుని ఎన్నిక

రాయదుర్గం, ఏప్రిల్ 8

అనంతపురంజిల్లా రాయదుర్గం పంచాయతీ సమితి అధ్యక్షులుగా శ్రీ గోపాలపురం లింగారెడ్డి ఎన్నికైనారు. ఆయనతో పోటీ చేసిన శ్రీ ఎస్. వి. శేషాద్రి ఓడిపోయారు.

"పంజాబ్ ప్రభుత్వం సంక్షోభంలో పడలేదు"

శ్రీ గుర్నాంసింగ్ స్పష్టీకరణ

చండీఘర్, ఏప్రిల్ 7

పంజాబ్ ఐక్య సంఘటన ప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ గుర్నాంసింగ్ నేడిక్కడ రాష్ట్ర గవర్నర్‌తో చర్చలు జరిపిన అనంతరం పత్రికా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ రాష్ట్రంలో సంక్షోభమేమీ లేదని అన్నారు.

గవర్నరుతో సమావేశసందర్భంగాఅనేక విషయాలను చర్చించామని ఆయన అన్నారు.

శాసనసభలో ప్రతిపక్షం ప్రతిపాదించిన సవరణపై ప్రభుత్వ ఓటమి తర్వాత రాష్ట్రంలో ఐక్యసంఘటన ప్రభుత్వపరిస్థితిని గురించి చర్చించారా? అన్న ప్రశ్నకు సమాధానంగా పంజాబ్ ప్రభుత్వం విషయంలో ఏ సంక్షోభంగాని, ఏ వివాదంగాని లేదని ఆయన స్పష్టంచేశారు.

ఏప్రిల్ 6వ తేదీ రాష్ట్ర శాసనసభా కార్యక్రమాన్ని గవర్నర్ పరిశీలించారా? అన్న ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని గురించి రాష్ట్ర గవర్నర్‌ను అడగటమే మంచిదని ఆయన అన్నారు.

రాష్ట్ర శాసనసభ తిరిగి జూన్ మాసంలో సమావేశం కాగలదని ముఖ్యమంత్రి సూచన ప్రాయంగా తెలియజేశారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మూడు మాసాలలోగా బడ్జెట్‌ను శాసనసభ ఆమోదించవలసి వుంటుంది, కనుక ఆ గడువు పూర్తయ్యేలోగా శాసనసభను సమావేశపర్చవలసి వుందని ఆయన తెల్పారు.

ప్రధాని ఏప్రిల్ 9 న ఏర్పాటు చేస్తున్న ముఖ్య మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు తాను నేడు ఢిల్లీకి బయలుదేరి వెళ్తున్నానని శ్రీ గుర్నాంసింగ్ చెప్పారు. పంజాబ్ రాష్ట్రానికి మరింతగా కేంద్రం సహాయం చేయాలని తాను ఒత్తిడి తేనున్నానని ఆయన చెప్పారు.

ఆహార ధాన్యాల రవాణాపై నిషేధం ఎత్తివేయాలట

ఆహారమంత్రికి కొనుగోలు దారుల సమాఖ్య విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

ఆహార ధాన్యాల వినిమయదారులను, ఉత్పత్తిదారులను కలిపేసి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అసాధారణమైన లాభాలు గుంజుతున్నాయని అఖిల భారత ఆహార ధాన్యాల కొనుగోలుదారుల అసోసియేషన్ల సమాఖ్య, కేంద్ర ఆహార మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్‌కు నేడొక మెమొరాండం సమర్పిస్తూ పేర్కొన్నారు.

ముతక బియ్యం, గోధుమ, పప్పుధాన్యాలు శనగలు రవాణామీద ప్రస్తుతం యెక్కడైనా సరే ఆంక్షలు వుంటే వాటిని తొలగించాలని సూచించింది.

ధాన్యం,బియ్యానికి సంబంధించి, ఆంధ్రప్రదేశ్, మైసూర్, మద్రాసు, కేరళ రాష్ట్రాలలో ఒకే ఒక ఆహార మండలం యేర్పాటు చేయాలని యీ మండలంలోని కొరతను కేంద్ర ప్రభుత్వం తీర్చాలని సూచించింది.

1962, 63 సంవత్సరములలో వున్నట్లుగా, ఉత్తర ప్రాంతాలలో పెద్ద పెద్ద ఆహారమండలాలను యేర్పాటుచేయవచ్చునని సూచించింది.

బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో తీవ్రమైన ఆదుర్దా కలిగిస్తున్న ఆహార ధాన్యాల సరఫరా క్లిష్ట పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం కల్పించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

కొన్ని రాష్ట్రాలు అధికంగా లాభాలు సంపాయిస్తున్నాయన్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పరిపాలనా నిర్వహణ ఖర్చులసాకుతో రాష్ట్రాలు చేస్తున్న కొనుగోలు, అమ్మకంలో యీ రాష్ట్రాలు అధికంగా లాభాలు సంపాయిస్తున్నాయని ఆరోపించింది. వినిమయదారులు ఆహార ధాన్యాలపై 25 నుండి 50 శాతం యీ ఖర్చులను భరించవలసి వస్తున్నదని తెలిపింది.

పొలాలపై మందుచల్లి ఐదుగురి దుర్మరణం

క్రిమిసంహారక ఔషధాల ప్రభావం వల్ల నెల్లూరుజిల్లాలో దుస్సంఘటన

నెల్లూరు, ఏప్రిల్ 7

ఇక్కడకు 18 మైళ్ళ దూరంలోని ఇసుకపల్లి గ్రామంలో పంటలపై క్రిమి సంహారక మందులను చల్లిన 20 మందిలోను 5 గురు ఆ మందుల ప్రభావానికి గురియై మరణించారు

ఇసుకపల్లి గ్రామంలోని 1500 ఎకరాల లోని పంటపై ప్రభుత్వాధ్వర్యాన మందు చల్లారు. ఈ కార్యక్రమం వ్యవసాయ శాఖ అధ్వర్యాన జరిగింది. రైతులు మందులను ఉచితంగా సరఫరా చేశారు. అనుభవములేని ఒక పర్యాయం మందు చల్లిన తరువాత ఇప్పుడు ఊప్పల సంపర్కంలో మందు జల్లారు.

మందులు చల్లేందుకు 20 మంది వ్యవసాయ కూలీలను ఉపయోగించారు. వారిలో 8 మంది ఆ రోజు సాయంత్రం 4 గంటలకే ఆ మందుల ప్రభావానికి లోనయ్యారు. వారు వాంతులతో అపస్మారక స్థితిలో వుండగా నెల్లూరు ఆస్పత్రికి తీసుకొచ్చారు.

అదే రోజు రాత్రి 10 గంటలకు వారిలో 5 గురు దుర్మరణం పాలయ్యారు. అదేరాత్రి 11 గంటలకు మరో 9 మందిని సైతం ఆస్పత్రికి తీసుకొచ్చారు. వారు కోలుకుంటున్నారు.

మరణించిన వ్యక్తుల పేర్లివి: తలారి కృష్ణయ్య, బాచుబాలయ్య, మెటంనరసయ్య, టి. కృష్ణయ్య, పులగరి వెంకట్రాయుడు.

మందు చల్లడాన్ని ఆపివేశారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.

కవితా గోష్ఠి

ఉగాది సందర్భగాం విశాలాంధ్ర ప్రచురణాలయంలో

విజయవాడ, ఏప్రిల్ 8

ప్లవంగ ఉగాది సందర్భము విశాలాంధ్ర ప్రచురణాలయం (ఏలూరురోడ్డు) మేడమీద ఏప్రిల్ 10 వ తేదీ, సోమవారం సాయంత్రం 5-30 గంటలకు వివిధ కవుల కవితా గోష్ఠి, శ్రీ రాజశేఖర పాండేచే ధ్వన్యనుకరణ, సత్యకళానికేతన్, విజయవాడ వారిచే సుగమ సంగీత కార్యక్రమము జరుగును, అందరు విచ్చేసి ఈ కార్యక్రమమును జయప్రదం గావించవలసిందిగా నవ్యసాహితీ సమితి విజయవాడ శాఖ, విశాలాంధ్ర ప్రచురణాలయం వారు కోరుతున్నారు.

విజయవాడలో చేనేత సంఘ కార్యవర్గ సమావేశం

పెడన, ఏప్రిల్ 8

ఆంధ్రప్రదేశ్ చేనేతసంఘ అధ్యక్షులు శ్రీ మెట్ల వీరయ్య క్రిందిప్రకటన చేస్తున్నారు:

ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘ కార్యవర్గ సభ్యులు కార్యకర్తల సమావేశం ఏప్రిల్ 17 వ తేదీ ఉదయం 7 గంటల నుండి విజయవాడలోని కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి ఆఫీసులో జరుగుతుంది. కార్యవర్గ సభ్యులంతా 16 వ తేదీ సాయంత్రానికి విజయవాడ చేరుకోవాలని కోరుచున్నాను.

చేనేత పారిశ్రామికుల పరిస్థితి రోజు రోజుకూ దిగజారిపోతున్నది. నూలు ధరలు చుక్కలు చూస్తున్నాయి. బట్ట నిలువల వడి పోతున్నది. ఫలితంగా నిరుద్యోగం ప్రబలుతున్నది. పస్తులు, వలసలు ప్రారంభమయినవి. ప్రభుత్వం కుంభకర్ణుడి నిద్రపోతోంది యీ పరిస్థితులన్నింటిని చర్చించి చేనేత పారిశ్రామికుల పరిస్థితిని బాగుచేయుటకు కార్యక్రమాన్ని రూపొందించుకోవాల్సి వుంది. కార్యకర్తలంతా తప్పక హాజరు కావలసిందిగా కోరుతున్నాను.

జాతీయ భాషగా సింధీ గుర్తింపు

రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

సింధీని జాతీయ భాషగా గుర్తిస్తూ 21వ రాజ్యాంగ సవరణ బిల్లు నేడు లోక్‌సభలో ఏకగ్రీవంగా ఆమోదించ బడింది.

రాజ్యసభలో యిదివరకే పైబిల్లు ఆమోదింప బడింది.

లోక్‌సభలో వివిధ పక్షాలకు చెందిన సభ్యులు బిల్లుకు స్వాగతం చెప్పారు. రాజ్యాంగ సవరణ బిల్లు అయినందున దానిపై ఓటింగ్ తీసుకోవలసి వచ్చింది. 326 మంది అనుకూలంగా వోటు చెయ్యడంతో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

భారత దేశంలోని వివిధప్రాంతాల్లో మాట్లాడేభాషలు కొంకణి, రాజస్తాన్, మణిపూరీ, మైథిలీ, భోజ్‌పురి, లడఖీలనుకూడా గుర్తిస్తూ చట్టరూపం కల్పించవలసిందిగా చర్చల సందర్భంలో కొంతమంది సభ్యులు తెలియజేశారు, గుజరాత్‌కుచెందిన కాంగ్రెసుసభ్యుడు శ్రీ తులసీదాస్ సేట్ ఉభయ పక్షాలసభ్యుల హర్షధ్వానాలమధ్య సింధీలో ప్రసంగించారు.

వ్యాఖ్యలు-విమర్శలు

పంజాబులో దొడ్డిదోవను కాంగ్రెసు పెత్తనమా?

పంజాబు అసెంబ్లీ నిరవధికంగా వాయిదా పడటం, గవర్నరు హడావుడిగా ఢిల్లీ పరుగెత్తడంతో పంజాబ్‌లో రాష్ట్రపతి పరిపాలన తప్పనిసరవుతుందనే వదంతులు బయలుదేరాయి. కొన్ని దిన పత్రికలపుడే ఆ వార్తకు పతాక శీర్షికలిచ్చి, అలాంటి వాతావరణం సృష్టించేందుకు తాపత్రయ పడుతున్నాయి.

ప్రజాతంత్ర సంప్రదాయాల యెడల పంజాబు కాంగ్రెసుపార్టీకి నిజమైన అభిమానముంటే ఐక్యసంఘటన మంత్రివర్గంపై అవిశ్వాస తీర్మానాన్ని పంజాబు అసెంబ్లీలో ప్రవేశపెట్టవచ్చు. అందుకు పూనుకోకుండా అల్లరి ప్రారంభించడం వల్లనే అసెంబ్లీ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేయాలసి వచ్చింది. తదనంతరం పంజాబ్‌కాంగ్రెస్ నాయకత్వం తమ భ్రాతలైన కేంద్రంలోని కాంగ్రెసు మంత్రులసాయంతో రాష్ట్రపతి పాలనఏర్పరచేందుకు తంటాలు పడటం జుగుప్సాకరంగా. వీలుంటే తమకాంగ్రెస్ పార్టీ మంత్రివర్గం, వీల్లేకపోతేరాష్ట్రపతిపాలన పేరుతో దొడ్డిదారిపెత్తనం చేయాలనే సంకుచిత దృష్టి, నియంతృత్వ ధోరణిని మాత్రమే వారి ప్రయత్నాలు ద్యోతకం చేస్తున్నాయి.

కేంద్ర హోంమంత్రి శ్రీ చావన్ ఫోన్ ద్వారా పంజాబురాష్ట్ర కాంగ్రెస్ నాయకమ్మన్యులతోమంతనాలుజరిపాడనీ, రాష్ట్రపరిపాలన తప్పనిసరి కావచ్చునే వదంతులు తెలుపుతున్నాయి. ప్రభుత్వం నుండి సాధికార సమాచారం వెలువడనందున, వదంతు లెంతవరకు నిజమో చెప్పలేం. కాని అలాంటి దుష్ట పన్నాగం ఆలోచనలో వుందని మాత్రం నమ్మవచ్చు

పరిపాలించే హక్కు కాంగ్రెసుపార్టీకి మాత్రమే వుండాలనే నియంతృత్వ ఆలోచనలే ఇరవై సంవత్సరాల పరిపాలనలో కాంగ్రెసు నాయకమ్మన్యులను ప్రస్తుత అధోగతికి తెచ్చినాయి. ఎన్నికలలో ప్రజలిచ్చిన పరిణామాత్మక తీర్పు తర్వాతకూడా కేంద్ర ప్రభుత్వం పంజాబులో రాష్ట్రపతిపాలన ఏర్పరిస్తే భారత ప్రజలు సహించరు. తగిన శాస్తి చేయగలరనడంలో సందేహంలేదు.

* * *

అన్నం తర్వాత జీవితావసరాల్లో ప్రధానమైనది బట్ట, మేలురకం మధ్యరకం వస్త్రాలపై యిదివరకే ధరల కంట్రోలు లేదు. జనసామాన్యం నిత్యంవాడే ముతకబట్టలపై నామమాత్రంగా ధరల కంట్రోలువుంది.

బట్టలమిల్లు యజమానుల తరఫున పార్లమెంటు, రాజ్యసభలో బాబుభాయ్ చినాయ్ సావధాన తీర్మానం ప్రవేశపెడుతూ, బట్టల మిల్లులకు నష్టం వస్తున్నందున ప్రస్తుతమున్న ధరల కంట్రోలును సైతం రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

వాణిజ్యమంత్రి దినేష్‌సింగ్ సమాధానమిస్తూ ముతకవస్త్రాల ధరలను పెంచడానికి అంగీకరించారు. ఐతే ధరల కంట్రోలును పూర్తిగా రద్దుచేయబోమని చెప్పుతున్నారు.

ముతకవస్త్రాలపై ప్రస్తుతమున్న ధరల కంట్రోల్ నామమాత్రమైనదే. ఏమంటే ఆ రకాలనైనా నిర్ణీత ధరలకు అమ్మించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవడంలేదు. కేవలం వస్త్రాల తానులపై కంట్రోల్ ధరలను ముద్రించాలనే నియమం వుంది గాని తద్విరుద్ధంగా హెచ్చురేట్లకు బాహాటంగా అమ్మేవారిని సైతం శిక్షించడంలేదు కాబట్టి అమాయకులైన ప్రజలు ఎక్కువ ధరలను చెల్లించక తప్పడంలేదు

వాణిజ్య మంత్రివాగ్దానంప్రకారం ముతక వస్త్రాల కంట్రోలు ధరలు మరింత పెంచడంమాత్రం జరుగుతుంది.

* * *

అలాగే ఈ వారంలో సిమెంటు మిల్లు యజమానులు కూడా ప్రభుత్వం వద్దకు రాయబారం వెళ్ళి, సిమెంటు ధరలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

గుత్తవ్యాపారుల వల ప్రచారం, ప్రభుత్వం ధరల కంట్రోల్ ఎత్తివేసిన సరుకుల్లో సిమెంటు ఒకటి. కంట్రోళ్ళు ఎత్తివేసిన తరువాత రెండుసార్లు ధరలను పెంచేందుకు సిమెంటు పరిశ్రమల యజమానులకు యిదివరకేరెండుసార్లు ప్రభుత్వం అనుమతించింది. ఈ సారి కూడ టన్ను 1కి మరో రు 20/- పెంచేందుకు ప్రభుత్వం అనుమతించవచ్చునని వదంతులు తెలుపుతున్నాయి.

ప్రభుత్వం ధరల కంట్రోళ్ళు ఎత్తివేస్తే ధరలు వాటంతటవే అదుపులోకి వస్తాయనీ గుత్తవ్యాపారులు, వారి పత్రికలూ నిరంతరం ప్రచారం చేస్తుంటాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, సిమెంటు ఇనుము, వగైరా సరుకులపై ధరల కంట్రోళ్ళు గుత్త వ్యాపారులు ఎత్తివేయించగలిగారు. తదనంతరం ధరలను పెంచాలని ఒత్తిడితెచ్చి, యిదివరకే రెండుసార్లు ప్రభుత్వాన్ని ఒప్పించారు. సిమెంటు పరిశ్రమదార్ల ప్రస్తుత ప్రయత్నం మూడోది.

ఇలా గుత్తవ్యాపారుల ఒత్తిడికి లొంగి, ప్రభుత్వంధరల పెంపకానికి అంగీకరించడం దారుణం. పెరుగుతున్న ధరలను భరించగల కొనుగోలుశక్తి జనసామాన్యానికిలేదు. వినియోగదార్ల ప్రయోజనాలను గమనించకుండా ధరలను పెంచడంవల్ల ప్రజానీకం బాధలు పెరుగుతాయి ఆర్థిక సంక్షోభానికి దారితీస్తే ఆ బాధ్యత పూర్తిగా కాంగ్రెసు ప్రభుత్వానిదే.

* * *

ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెసు మంత్రివర్గం పతనమై, కొత్త మంత్రివర్గం అధికారంలోకి వచ్చింది. ఏప్రిల్ 6 తేదీన ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోనుంచి వచ్చిన వార్త ప్రజాస్వామ్య వాదులందరిని ఆశ్చర్య చకితులను చేస్తుంది

సచివాలయం నుండి ఫైళ్ళ కట్టలను, రికార్డులను కారుపైన రిక్షాపైన వేసికొని పోతుంటే గేటు కాపలాదార్లు ఆపుజేశారు. పోలీసు శాఖకు, విద్యాశాఖకు చెందిన ఫైళ్ళను సచివాలయాలనుండి ఎత్తుకుపోయే ప్రయత్నం ఈ విధంగా బయటపడింది. ఈ రికార్డులో మాజీ ముఖ్యమంత్రి సి. బి. గుప్తా 50 లక్షల జన్మదినోత్సవ నిధికి సంబంధించిన ఫైళ్ళుకూడా వున్నాయని తెలుస్తూంది.

ఉత్తరప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ ఈ విషయమై దర్యాప్తు చేయవలసిందిగా ఉత్తరువు చేశారు. గుమ్మడికాయల దొంగ లెవరంటే భుజాలు తడుముకున్న చందంగా కొత్త మంత్రివర్గం ఏర్పడగనే సచివాలయంనుండి రికార్డులు దొంగలించేందుకు మాజీమంత్రులుప్రయత్నించారంటే వారెంత ఊబిలో వున్నారో బోధపడుతుంది. తమ తప్పులు. మోసాలు బైటపడతాయనే ఆతురత, నేరస్తుల మనస్తత్వమే ఫైళ్ళ దొంగతనానికి కారణం. ఈ చర్యే గుప్తా మంత్రివర్గ అవినీతికి ప్రత్యక్ష నిదర్శనంగా ఎంచవచ్చు.

కాంగ్రెసు ఓటమి ఖాయమని ధృవపడిన తర్వాత కొత్త మంత్రివర్గం రాకముందే మద్రాసు సచివాలయంలో కొన్ని ఫైళ్ళను తగులబెట్టారని వార్తలొచ్చాయి. మాజీముఖ్యమంత్రి భక్తవత్సలం తాము అలా చేసినమాట నిజమేనని అంగీకరించక తప్పలేదు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో ఫైళ్ళ దొంగతనం బయటపడింది.

ఇరవైయేళ్ళుగా అధికారంలో కాంగ్రెసు నాయకమ్మన్యులు ఏ విధంగా ప్రజాతంత్ర విధానాలకు దూరమయ్యారో పై ఉదంతాలు నిరూపింపుతాయి. తమ పార్టీ ఒకదానికే పరిపాలించే హక్కు వుందనే అహమే పై తప్పులన్నిటికీ మూలకందం, ప్రజలముందు నిలబడి, వారి ఆమోదం పొందగలగడమే ప్రజాస్వామ్యానికి మూలసూత్రమని గుర్తించివుంటే, అవినీతి వూబిలో గొంతు లోతున దిగడానికి వెరుస్తారు, అప్పుడిలా [illegible] దొంగలించాల్సిన అవసరం వుండేది కాదు.

వ్యవసాయ కార్మిక మహాసభ

(1 వ పేజీ తరువాయి)

వామపక్ష నాయకులను ఆహ్వానించాలని నిర్ణయించబడింది.

ప్రదేశ్ మహాసభ సందర్భంగా వ్యవసాయ కార్మికోద్యమ ఆందోళన, పోరాటాలను ప్రతిబింబిస్తూ ప్రత్యేక సంచికను తీసుకురావలసిందిగా దీర్ఘకాలంగా వ్యవసాయ కార్మికోద్యమ వాణిగావున్న విశాలాంధ్ర పత్రికా సంపాదకులకు విజ్ఞప్తి చేస్తూ తీర్మానించ బడింది.

ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభకు వివిధ జిల్లాల్లోగల సంఘ సభ్యత్వం ఉద్యమ బలం ఆధారంగా ఈ క్రింద తెల్పినవిధంగా ప్రతినిధులు సౌహార్ద ప్రతినిధులు పాల్గొనడానికి అర్హత కలిగివున్నారని నిర్ణయించ బడింది.

(1) కృష్ణాజిల్లా 200, (2) తూర్పుగోదావరి 100, (3) పశ్చిమ గోదావరి 100, (4) గుంటూరు 200, (5) నల్లగొండ 100, (6) వరంగల్లు 100, (7) ఖమ్మం 100, (8) మెదక్ 50, (9) దక్షిణనెల్లూరు 50, (10) ఉ.నెల్లూరు50, (11) మహబూబ్‌నగర్ 50, (12) కరీంనగర్ 50, (13) కర్నూలు20, (14) కడప 10, (15) అనంతపురం 10, (16) చిత్తూరు 10, (17) అదిలాబాద్ 10, (18) శ్రీకాకుళం 10, (19) నిజామాబాద్ 5, (20) విశాఖ 5 హైద్రాబాద్ 5. మొత్తం సంఖ్య 1235.

4. ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభకు నెల్లూరుజిల్లానుండి నల్గొండజిల్లా నుండి గుంటూరుజిల్లానుండి ప్రతినిధులుపాదయాత్ర చేస్తూమహాసభకుప్రచారంగావించుతూ సభకు హాజరుకావాలనే పట్టుదలను వ్యక్తం చేశారు. అదే విధంగా తూర్పుగోదావరి, కృష్ణ, ఖమ్మం, పశ్చిమ గోదావరిజిల్లాల నుండికూడా పాదయాత్రద్వారాగాని సైకిళ్ళపై గాని యాత్రజరుపుతూమహాసభలో పాల్గొనే ప్రయత్నాలు చేస్తామని ఆ యా జిల్లాల ప్రతినిధులు తమఅభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సాధ్యమైనన్ని జిల్లాలలో దళ ప్రచారంద్వారా ప్రదేశ్‌మహాసభ ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రచారంచేయాలని నిర్ణయించబడింది.

5. రాబోవుకాలంలో వివిధ జిల్లాలలో కూలిరేట్లు, పాలేరు జీతాల పెరుగుదలకు, ఆహారధాన్యాల ధరలు, యితర జీవితావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టాలని, బంజరు భూముల పంపిణీకి దళప్రచారం ద్వారా ఆందోళన సాగించి సాధ్యమైనన్ని ప్రదేశాలలో పోరాటాలుసాగించి విజయాలను సాధించాలని తీర్మానించబడింది.

6. నూతన సంవత్సరానికి లక్ష ఇరవై వేల సంఘ సభ్యత్వం చేర్పించాలని జిల్లాలవారీగా కోటాలు తీసుకోబడ్డాయి.

7. ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభలో గతంలో జరుగని తాలూకా, జిల్లాలలో మహాసభలు జరుపాలని కూడా నిర్ణయించబడింది.

8. వ్యవసాయకార్మికుల వేతనాలు, పాలేరు జీతాల సమస్యను చర్చించి డెల్టా, ప్రాజెక్టు ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులకు నాట్లు, కోతలకుగాను దినకూలి 9 శేర్ల ధాన్యం లేదా దానికి సమానమైన డబ్బు కనీసకూలిగావుండాలని, యింకా కష్టమైన పనులకు యింకా ఎక్కువ వేతనం సాధించాలని, తీర్మానించబడింది. అదేవిధంగా యీ ప్రాంతంలో పాలేరుకు 32 బస్తాల ధాన్యం జీతంగా వుండాలని, 30 రోజుల శెలవులు వుండాలని కూడా నిర్ణయించబడింది.

అలాగే యితర మెట్ట ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులకు దిన కూలి కనీసం 4 శేర్ల గట్టి గింజలు వుండాలని, పాలేరుకు 15 బస్తాల గట్టి గింజలు లేదా 20 బస్తాల ధాన్యము 30 రోజుల శెలవులు వుండాలని నిర్ణయించ బడింది.

యీ నిర్ణయాన్ననుసరించి ఆయాప్రాంతాలలో కూలి రేట్ల పెరుగుదలకు, పాలేర్ల జీతాల పెరుగుదలకు ఆందోళన పోరాటాలను సాగించాలని తీర్మానించ బడింది.

9. ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ కార్యాలయాన్ని మహాసభల జరిగే వరకు తాత్కాలికంగా విజయవాడకు మార్చాలని నిర్ణయించ బడింది.

పన్నులను తగ్గించే ప్రసక్తే లేదట!

వాణిజ్యమండలి సభలో మొరార్జీ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఏ పధంగాను పన్నులను తగ్గించే ప్రసక్తే లేదని భారత వాణిజ్య, పారిశ్రామిక మండలి 40వ వార్షిక సభను ప్రారంభిస్తూ డిప్యూటీ ప్రధానమంత్రి మొరార్జీదేశాయి చెప్పారు.

మనశక్తికి అనుగుణంగా భద్రతకు అవసరమైన వనర్లనుపరిశీలించాలని అన్నారు. ద్రవ్యోల్బణం మరింతగా పెరిగిపోకుండా అట్టి కార్యక్రమాన్ని చేపట్టాలని కూడా ఆయన నొక్కిచెప్పారు.

భారతదేశంలో పన్నులభారం ఎక్కువైపోయిందనే వాదాన్ని ఆయన అంగీకరించలేదు. బాగా అభివృద్ధి పొందిన దేశాలలో పన్నుల రూపంలో వచ్చే జాతీయాదాయం భారతదేశంలోకంటె 14 శాతం ఎక్కువగావుందనీ, పన్నుల సమస్యను హేతువాద దృష్టితో చూడవలసివుందనీ అన్నారు.

ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్థిక ప్రతిష్టంభన తాత్కాలికమనీ, తిరిగి మన ఆర్థిక వ్యవస్థ పుంజుకొని ముందుకు పోతుందనే విశ్వాసం తనకుకలదనీ, ప్రస్తుత ఆర్థిక పరిస్థితికి నిరాశ చెందనక్కరలేదనీ ఆయన అన్నారు.

ధరలను అదుపులో పెట్టాలనీ, పెరిగిపోనివ్వరాదనీ చెప్పారు.

దరిద్రం, కొరతల మధ్య మనం జీవిస్తున్న దృష్ట్యా కంట్రోళ్ళు అవసరమని చెప్పారు. కంట్రోళ్ళు అభివృద్ధికి సహాయపడాలేకాని, దాన్ని అరికట్టరాదనీ, కాని ప్రస్తుతం కంట్రోళ్ళు అందుకు సహాయపడునట్లు తాను చెప్పలేననీ అన్నారు.

ప్రజాస్వామ్యానికి విమర్శ ప్రధానమైనదే అయినా, అది బాధ్యతా రహితంగా వుండరాదని చెప్పారు.

1963 లో తాను వేసిన అధిక పన్నులకు ప్రజలు స్వాగతంయిస్తారని తాను భావించలేదనీ, కాని ఆ పన్నులు వెయ్యకపోతే పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారత్ తననుతాను రక్షించుకోలేకపోయి వుండేదని చెప్పుకున్నారు.

దేశంయొక్క భవిష్యత్తును అందరూ కాంక్షించాలనీ, ఆ వ్యక్తుల భవిష్యత్తుకు వ్యతిరేకం కావనీ అన్నారు.

వాణిజ్యమండలి యిచ్చిన సలహాలను ఆలోచిస్తానని హామీ యిచ్చారు.

---

61 మంది విదేశాల గూఢచారుల అరెస్టు

రాజ్యసభలో హోంమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

విదేశాలతరఫున గూఢచారి చర్యలు కొనసాగిస్తున్నారనే అనుమానంపై ఈసంవత్సరం మొదటి 69 రోజుల్లోను 61 మంది వ్యక్తులను అరెస్టుచేసినట్లు హోంశాఖస్టేట్ మంత్రి శ్రీ విద్యాచరణ్‌శుక్లా నేడు రాజ్యసభలో చెప్పారు.

దేశరక్షణచట్టం, విదేశీయులచట్టం, అధికార రహస్యాల చట్టాలక్రింద వారినిఅరెస్టు చేసినట్లు, అందుకు సాక్ష్యం లభిస్తున్నట్లు శ్రీ వి. యం. కోర్డియా ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు.

మైనారిటీ జాతులకు ప్రభుత్వ అన్యాయం

రాజ్యసభలో శ్రీ భూపేష్ తీవ్ర విమర్శ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

1965 లో భారత - పాకిస్తాన్ వివాదం కాలంలో మైనారిటీజాతులకు భారతప్రభుత్వం అన్యాయం చేసిందని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ భూపేష్‌గుప్తా నేడు రాజ్యసభలో విమర్శించారు.

శ్రీ భూపేష్ విమర్శను హోంమంత్రి శ్రీ వై. బి. చావన్ నిరాకరించారు. ఈ విషయమై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయనీ. వీటినన్నింటిని పరిశీలించమని రాష్ట్ర ముఖ్య మంత్రులను కోరామన్నారు. ఈ పరిశీలనల ఫలితంగా అనేక మందిని విడుదల చేయటం జరిగిందన్నారు.

భారత - పాకిస్తాన్ వివాదాన్ని పురస్కరించుకొని ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంక్రింద ఎవరినీ డిటెయిన్ చెయ్యలేదనీ, దేశరక్షణ చట్టం క్రింద అరెస్టు చేసిన 1889 మందిలో ఇంకా 8 మందిని మాత్రం వదిలిపెట్టలేదన్నారు. వీరిలో ఒకరు అస్సాం, 7 గురు జమ్మూ, కాశ్మీర్‌కు చెందినవారు.

త్రిపురకు పాక్ కాందిశీకుల వలస

కలకత్తా, ఏప్రిల్ 7

తూర్పుపాకిస్తాన్‌నుండి కొత్తగా వస్తున్న కాందిశీకులు తమ ప్రభుత్వానికి ఒక సమస్యగా తయారయ్యారని త్రిపుర ముఖ్యమంత్రి శ్రీ యస్. యల్. సింగ్ నేడిక్కడ చెప్పారు.

తూర్పు పాకిస్తాన్‌లో తీవ్రమైన ఆహార కరువు, ఆర్థిక క్లిష్ట పరిస్థితులు ఏర్పడంవల్ల రోజుకి 30, 40 మంది కాందిశీకులు తూర్పు పాకిస్తాన్‌నుండి సరిహద్దులుదాటి తమరాష్ట్రానికి వస్తున్నారని దండం విమానాశ్రయంవద్ద ఆయన పత్రికల వారికి చెప్పారు.

ఫిబ్రవరి, మార్చి నెలల్లో 2000 మంది కాందిశీకులు త్రిపుర వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

అమెరికాకు శ్రీ మురార్జీ జేజేలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

భారత సహాయక దేశాల సంస్థలు, ప్రపంచబ్యాంకు మన అభివృద్ధి కృషికి అవసరమైనసహాయాన్ని యథాతథంగాస్నేహపూర్వకంగా నిర్మాణ యుతంగా కొనసాగిస్తున్నవని కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ నేడు లోక్‌సభలో భారత ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు చెప్పారు.

1967-68 లో భారతదేశానికి ఇవ్వనున్న సహాయంపై ఇటీవల పారిస్‌లో సమావేశమయిన భారతసహాయక సంస్థలనిర్ణయంపై కొందరు ప్రతిపాదించిన సావధాన తీర్మానానికి శ్రీ మురార్జీ దేశాయ్ పై ప్రకటన చేశారు.

ఎన్. టి. సి. కార్మిక వేతనాల హెచ్చింపు

మంగళగిరి, ఏప్రిల్ 6

ఆంధ్రప్రదేశ్ నేషనల్ టుబాకోమజ్దూర్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ వి. వి. సుబ్బారావు, నేషనల్‌టుబాకో మేనేజ్‌మెంటు(గుంటూరు)కు 1967 సీజను ప్రారంభమునుండే రోజుకు 92 పైసలు కూలిపెంచాలని 1966 అక్టోబరులో మెమోరాండం యిచ్చారు. ఆ డిమాండుపై గత డిసెంబరు నుంచీ జరిగిన సంప్రతింపులలో రాజీ కుదరనందున యీ నెల 1 వ తేదే నుంచీ హైద్రాబాద్‌లో జరిగిన సంప్రతింపులపై కార్మికశాఖా మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ సలహాపై ఈ జనవరి 1 నుండి యీ క్రింది విధంగా ఫ్యాక్టరీలు రోజు వారి కూలిపెంచుటకు లేబరు కమీషనరు సమక్షంతో మూడు సంవత్సరాల అమలులో వుండు ఎగ్రిమెంటు కుదిరింది. పెరిగిన కూలి వివరం. పాత కూలీ, కొత్త కూలి)

(1) గ్రేడర్సు రు. 2-34. రు. 0-59.
(2) దేబిల్‌చెక్కర్లు రు. 2-16 రు. 0-59.
(3) లైను మేస్త్రీలు రు. 2-52 రు. 0-59.
(4) హెడ్‌మేస్త్రీలు రు. 2-59 రు. 0-65.
(5) మొగకార్మికులు రు. 2-59 రు. 0-59.
(6) మార్కర్సు రు. 2-59 రు. 0-65.

ఆంధ్ర ప్రభుత్వానికి అప్పీలుకు అనుమతి నిరాకరణ

వెనుకబడిన తరగతుల ఉత్తరువుపై హైకోర్టు యిచ్చిన తీర్పుపై

హైదరాబాదు, ఏప్రిల్ 7

వెనుకబడిన తరగతుల విషయంలో ప్రభుత్వం జారీచేసిన ఉత్తరువు చెల్లదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు యిచ్చిన తీర్పుపై, సుప్రీంకోర్టుకి అప్పీలు చేసుకోడానికి రాష్ట్ర ప్రభుత్వానికిఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచి నేడు అనుమతి నిరాకరించింది. ఆ డివిజన్ బెంచిలో ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. జగన్‌మోహనరెడ్డి, జస్టిస్‌వెంకటేశం ఉన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వు క్రమబద్ధంగా లేదని మెడికల్ విద్యార్థులు దాఖలు చేసిన 104 రిట్‌పిటిషన్‌ల సందర్భంగా, అక్టోబరు 7 న హైకోర్టుయిచ్చిన ఉత్తర్వులో తెలియజేసింది.

భారత-సోవియట్ దౌత్య సంబంధాల 20 వ వార్షికోత్సవం

ఉభయదేశాల్లో సన్నాహాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

భారత - సోవియట్ దేశాలమధ్య దౌత్య సంబంధాలు నెలకొల్పి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఉభయదేశాల్లోను అధికారపూర్వకంగా ఉత్సవాలు జరపాలని భారత - సోవియట్‌లు పథకం వేస్తున్నాయి.

భారత - సోవియట్ యూనియన్‌ల మధ్య దౌత్యసంబంధాలను నెలకొల్పుకుంటూ 1947 ఏప్రిల్ 13 న ఉభయదేశాలు రాయబారుల లేఖలు యిచ్చి పుచ్చుకున్నాయి.

న్యూఢిల్లీలో ఆరోజున జరిగే ఉత్సవాల సందర్భంలో ఒకరిసెప్షన్ జరుగుతుంది. పలువురు [illegible] ఆ సభలో ఉపన్యసిస్తారు.

సైన్యాధికార్లకు సైతం తప్పని రిట్రెంచిమెంట్

ప్రభుత్వ నిర్ణయంపై లోక్‌సభలో సభ్యుల నిశిత విమర్శ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

సైన్యంలో అత్యవసర ప్రాతిపదికపై చేర్చుకున్న కమిషన్ అధికార్లలో మూడింట రెండువంతుల మందిని దశలవారి కార్యక్రమంపై విడుదలచేయాలన్న దక్షిణ మంత్రిత్వశాఖ నిశ్చయాన్ని నిన్న లోక్‌సభలో అన్ని పక్షాల సభ్యులు నిశితంగా విమర్శించారు.

జనసంఘ్ సభ్యుడు శ్రీ బలరాజ్ మధోక్ ఈ విషయమై ప్రతిపాదించిన అత్యవసర ప్రశ్నపై 35 నిమిషాలపాటు తీవ్రంగా చర్చ జరిగింది.

అత్యవసర ప్రాతిపదికపై చేర్చుకున్న కమిషన్ అధికార్లలో మూడింట ఒక వంతును శాశ్వత కమిషన్ అధికార్లుగా తీసుకోవాలనీ మిగిలిన వారందరినీ 1967-70 మధ్య కాలంలో దశలవారీగా నాలుగు దఫాలలో విడుదల చేయాలనీ ప్రభుత్వం నిశ్చయించిందని రక్షణ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ చెప్పారు.

ఈ సమస్యపై యస్. ఎ. డాంగే, డాక్టర్ రామమనోహర లోహియా, యస్. యన్. ద్వివేది తదితరులు ప్రశ్నలవర్షం కురిపించారు.

భారత - పాకిస్తాన్ వివాదం కాలంలో అనుభవం గడించిన 1500 మందికిపైగా అత్యవసర కమిషన్ అధికారులను తొలగించటం చైనా ఛాలెంజి కొనసాగితే దానిని ఎదుర్కొనగలుగుతారా అని శ్రీ రంజిత్‌సింగ్ అనుబంధ ప్రశ్నను సభ దృష్టికి తీసుకొచ్చారు.

చైనా, పాకిస్తాన్‌లనుండి రాగల ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయడంలేదనీ దేశసమగ్రతను, సార్వభౌమాధికారాన్ని కాపాడుకొనేందుకు సిద్ధంగా వున్నామని శ్రీ స్వరణ్‌సింగ్ చెప్పారు.

సైన్యంనుండి తొలగించిన అధికార్ల పునరావాసాన్ని గురించి అనేకమంది అనుబంధ ప్రశ్నలను వేశారనీ, మంత్రి సమాధానాలు అసంపూర్తిగా, అసంతృప్తికరంగా వున్నాయని స్పీకర్‌కు ఫిర్యాదు చేసి యస్.యస్.పి. సభ్యుడు శ్రీ మధులిమాయె వాకౌట్ చేశారు.

అధికార్లకు ఇవ్వనున్న పెన్షన్, నష్ట పరిహారంపై శ్రీమతి శారదాముఖర్జీ ప్రసంగించారు.

అధికార్లను స్థిరపరిచేటప్పుడు వారి యుద్ధ అనుభవాలను, వారి శక్తియుక్తులను పరిగణనలోనికి తీసుకుంటామని రక్షణ మంత్రి చెప్పారు.

సైన్యంనుండి తొలగిస్తున్నవారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నదన్నారు.

నీఫా పరాజయాలకు కారణం తగినంత మంది అనుభవజ్ఞులయిన అధికారులు లేకపోవటమేనని శ్రీ హెండర్‌సన్ (బ్రూక్స్) తన నివేదికలో వెల్లడించారని, అటువంటి పరిస్థితులలో ఈ చర్యకు దిగటం సమంజసం కాదని శ్రీ హేమ్‌బారువా చెప్పారు.

ఈ చర్య దేశంలోని యువకుల ఉత్సాహాన్ని పెంపుదల చేసేందుకు దోహదకారి కాదని శ్రీ డి. సి. శర్మ విమర్శించారు.

దేశం సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు సైన్యంలో సేవచేసేందుకు యువకులు ఎక్కువగా ముందుకు వస్తారనుటలో నాకెట్టి సందేహంలేదని రక్షణమంత్రి సమాధానమిచ్చారు.

అత్యవసర ప్రాతిపదికపై చేర్చుకున్న అధికార్లవేషభాషలలో అలవాట్లలోవున్న సాంప్రదాయాలను పాటించనివారుకానందున ధనికకుటుంబాలనుండివచ్చిన అధికార్లు వీరిని నెట్టివేస్తున్నారన్న లోహియా విమర్శను రక్షణ మంత్రి తిరస్కరించారు.

పారిపోయిన సైన్యాధిపతులు తప్పుడు గ్రంథాలను వ్రాయుటకు అనుమతించటం, నిరుద్యోగంతో సమర్థవంతంగా పోరాడే ప్రజానీకానికి బహుమతులివ్వడం ప్రభుత్వ విధానమా అని కమ్యూనిస్టు పక్షనాయకుడు శ్రీ ఎస్. ఏ. డాంగే ప్రశ్నించారు.

అది మా విధానం కాదని ముక్తసరిగా జవాబిచ్చి రక్షణమంత్రి తప్పుకున్నారు.

సభలు-సమావేశాలు

గుంటూరు జిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం ఈ నెల 14, 15 తేదీలలో జిల్లా సమితి కార్యాలయంలో జరుగుతుంది. సమావేశం 14 వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని సమితి సభ్యులంతా తప్పక హాజరుకావాలని జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ వేములపల్లి శ్రీ కృష్ణ ప్రకటిస్తున్నారు.

ఎజెండా :

1. ప్రదేశ్ సమితి నిర్ణయాలు.
2. ఎన్నికల సమీక్ష
3. రాష్ట్ర వ్యవసాయ కార్మిక మహాసభ

* * *

నల్గొండజిల్లా హుజూర్‌నగర్ తాలూకా పార్టీ సభ్యుల సర్వసభ్య సమావేశం ఈ నెల 13, 14 తేదీలలో హుజూర్‌నగర్ పట్టణంలో జరుగుతుంది. సమావేశం 13 వ తేదీ 1 గంటకు ప్రారంభమవుతుంది.

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ యన్. గిరిప్రసాదరావు పాల్గొంటారు. సభ్యులందరు హాజరు కావలసిందిగా తాలూకా సమితి కార్యదర్శి కామ్రేడ్ చింతలపూడి రాములు కోరుతున్నారు.

కరీంనగర్‌జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా శ్రీ జె. హనుమంతరావు ఎన్నికయ్యారు. వీరు జగపతిరావును ఓడించారు.

పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ అధ్యక్షునిగా శ్రీ మసానీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

1968 మార్చి 31 తో అంతమయ్యే సంవత్సరానికి పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ అధ్యక్షులుగా లోక్‌సభలోని స్వతంత్రపార్టీ పక్షనాయకులు శ్రీ ఎం. ఆర్. మసానీ నియమించబడ్డారు.

ఎస్టిమేట్స్ కమిటీ అధ్యక్షులుగా కాంగ్రెస్ సభ్యులు శ్రీ పి. వెంకటసుబ్బయ్యను నియమించారు.

బిర్లా ఆదేశంపై మంత్రిగా సిన్హా నియామకం?

భూపేష్ విమర్శకు మంత్రి ఫక్రుద్దీన్ నిరాకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ బిర్లా ఆదేశానుసారం శ్రీ సత్యనారాయణ సిన్హాను మంత్రివర్గంలో చేర్చారని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ భూపేష్‌గుప్తా నిన్న రాజ్యసభలో చేసిన విమర్శను పరిశ్రమల మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ నేడు సభలో నిరాకరిస్తూ ఒక ప్రకటన చేశారు.

శ్రీ భూపేష్ విమర్శ 'అవాస్తవం' 'ఆధారరహితం' అని శ్రీ ఫక్రుద్దీన్ అన్నారు.

శ్రీ ఫక్రుద్దీన్ ప్రకటన చేసిన అనంతరం శ్రీ భూపేష్ గుప్తా లేచి తాను చేసిన విమర్శకు సంబంధించిన వార్త ఒక పత్రికలో ప్రచురితమైందని తెల్పుతూ, ఆ వార్త అబద్ధమైతే, ప్రభుత్వం వెంటనే ఎందుకుఖండించలేదు అని ప్రశ్నించారు.

లోక్‌సభలో శ్రీ చావన్ ప్రకటన చేయలేని స్థితి

జనసంఘ్ అభ్యర్థి హక్కుల తీర్మాన సందర్భంగా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

జనసంఘ సభ్యుడు శ్రీ కన్వాల్‌లాల్ తెచ్చిన హక్కుల తీర్మానంపై హోంమంత్రి శ్రీ వై. బి. చావన్ ప్రకటన చేయటాన్ని నేడు లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు విరోధించారు.

లోక్‌సభ సభ్యుడు స్వామీబ్రహ్మానంద్‌ను అరగంటపాటు నిర్బంధంలో ఉంచిన విషయాన్నిగాని, ఆ తర్వాత విడుదల చేసిన సమాచారాన్నిగాని స్పీకర్‌కు అందజేయక పోవటంద్వారా, ఢిల్లీ అధికారులు సభా హక్కులకు భంగం కలిగించారని జనసంఘ సభ్యుడు వాదించాడు.

స్వామి బ్రహ్మానందతోపాటు, గోవధ నిషేధ ఉద్యమ సందర్భంగా సత్యాగ్రహం చేస్తున్న మరో 186 మందిని కూడా పోలీసులు పోలీసు స్టేషనకు తీసుకొనివెళ్ళి అరగంటసేపు నిర్బంధించారని ఆయన అన్నారు.

ఢిల్లీ పోలీసు అధికారులు అందజేసిన సమాచారం ప్రకారం ప్రకటన చేస్తున్నానని కేంద్ర హోంమంత్రి శ్రీ చావన్ తెల్పారు. ఇందుకు డాక్టర్‌లోహియా తీవ్ర అభ్యంతరం తెల్పారు.

శ్రీ చావన్ ప్రతిపక్ష సభ్యులు అడ్డు సవాళ్ళ మధ్య ప్రకటనచేస్తూ ప్రదర్శకులు తమంతటతామే పోలీసువాహనాలు ఎక్కారని అన్నారు. దీనికి జనసంఘసభ్యులు తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు.

జనసంఘ సభ్యులు శ్రీ వాజ్‌పాయ్ మాట్లాడుతూ, ఇది చాలా తీవ్ర విషయమని వాస్తవాలను తెలుసుకునేందుకు హోం మంత్రికి వ్యవధికావాల్సివస్తే తీసుకోవచ్చని, రేపు ప్రకటన చేయవచ్చని అన్నారు.

స్పీకర్ ఈ సూచనను అంగీకరించారు.

రాజగోపాలాచారికి శస్త్ర చికిత్స

మద్రాసు, ఫిబ్రవరి 8

స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ రాజగోపాలాచారికి నేటి ఉదయం ఇక్కడ ఒక ప్రయివేటు నర్సింగ్‌హోమ్‌లో హెర్నియా వ్యాధికి శస్త్ర చికిత్స జరిపారు.

వియత్నాం సమస్యపై అమెరికా ఒత్తిడికి భారత్ లొంగుబాటు

రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులతోపాటు కాంగ్రెస్ సభ్యుడు శ్రీ అరోరా తీవ్రవిమర్శ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

"వియత్నాంనుంచి అమెరికా సైనిక బలగాలను బేషరతుగా ఉపసంహరించడానికి, వియత్నాంలోని విదేశీ సైనిక స్థావరాలన్నింటిని రద్దుచేయడానికి శాంతి, స్వేచ్ఛాప్రియ దేశాలన్నింటితో భారత ప్రభుత్వం దౌత్య, రాజకీయ చొరవను తీసుకోవాలి"ని డిమాండ్‌చేస్తూ నేటి రాజ్యసభలో కాంగ్రెసు సభ్యులు శ్రీ అర్జున అరోరా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు.

ఈ విషయంలో భారత ప్రభుత్వం దృఢంగా వ్యవహరించడంలోనూ, ఈ సమస్యపై శాంతి ప్రియదేశాలను కూడగట్టడంలో భారత ప్రభుత్వం విఫలమయింది. అంతర్జాతీయ కంట్రోలు కమిషన్ ఛైర్మన్‌గా తీసుకోవాల్సిన చొరవ లోపించింది. వియత్నాం సమస్యపట్ల భారత్‌కు ప్రత్యేక బాధ్యత ఉన్నదని ఆయన తన తీర్మానాన్ని వివరిస్తూ అన్నారు.

జెనీవా ఒప్పందాన్ని ఐక్య రాజ్యసమితి నిబంధనావళిని అమెరికా అతిక్రమించిందని, వియత్నాం యుద్ధాన్ని కొన్ని అమెరికా సంస్థలు కూడ ఖండించాయని ఆయన పేర్కొన్నారు.

వియత్నాంపై బాంబు దాడులను నిలుపు చేయమని డిమాండు చేసినంత మాత్రాన సరిపోదని, దృఢ నిశ్చయంతో భారతదేశం వీరోచిత పాత్రను నిర్వహించాలని, వియత్నాములోని సైనిక బలగాల ఉపసంహరణకు అమెరికాపై తీవ్ర వత్తిడి తేవాలని తెలిపారు.

అమెరికా వత్తిడికి లొంగిన ప్రభుత్వ విదేశీ విధానంపై శ్రీ భూపేష్ విమర్శ

వియత్నాం యుద్ధంపట్ల భారతప్రభుత్వం అమెరికా వత్తిడికి లొంగి తన విధానాన్ని మార్చుకున్నదని కమ్యూనిస్టు పక్ష నాయకులు శ్రీ భూపేష్‌గుప్తా ఆ తీర్మానాన్ని బలపరుస్తూ అన్నారు.

జెనీవా ఒప్పందాన్ని అమలు పరచడానికి అంతర్జాతీయ కంట్రోలు కమిషన్ అధ్యక్షురాలుగా భారత్ వైఖరిని ప్రపంచ మంతా చూస్తున్నదని అన్నారు.

అమెరికా వత్తిడికి లొంగి భారత ప్రభుత్వం తన ప్రయత్నాలను మందగింప చేస్తున్నదని తెలిపారు.

వియత్నాం విషయంలో కీ॥ శే॥ నెహ్రూ తీసుకున్న వైఖరిని భారత్ ప్రభుత్వం విడనాడిందని, నేడు ఆర్థిక విధానంలో మాదిరిగానే భారత విదేశాంగ విధానం కూడా అమెరికా చేతుల్లో ఉన్నదని విమర్శించారు. భారత్ లాంటి గొప్పదేశం ప్రవర్తించాల్సిన విధానం ఇది కాదని అన్నారు.

వియత్నాం సమస్యపట్ల భారత ప్రభుత్వ విధానాన్ని విమర్శిస్తూ కాంగ్రెసు సభ్యులు శ్రీ దివాన్ చమన్‌లాల్, మార్క్సిస్టుపార్టీ సభ్యులు శ్రీ నిరేన్‌ఘోష్‌లు ప్రసంగించారు.

అమెరికా వత్తిడికిలొంగి భారతప్రభుత్వం వియత్నాంపట్ల తన విధానాన్ని మార్చుకున్నదని శ్రీ భూపేష్ చేసిన విమర్శను విదేశాంగమంత్రి శ్రీ చాగ్లా నిరాకరించారు.

అమెరికా వత్తిడికి లొంగి ఉత్తర వియత్నాంతో భారత ప్రభుత్వం వాణిజ్యాన్ని నిలిపివేసిందని ఆరోపించడం సమంజసం కాదని అన్నారు.

దక్షిణ వియత్నాంతో భారత వాణిజ్యాన్ని ప్రస్తావిస్తూ, సైనిక సామగ్రులను కాకుండా మిగతా వాటిని మాత్రమే దక్షిణవియత్నాంకు ఎగుమతి చేస్తున్నామని, ఉత్తర వియత్నాంకు సైతం ఎగుమతి చేస్తే అది చైనాకు మళ్ళించ వచ్చుననే భయం కారణంగా ఉత్తర వియత్నాంతో వాణిజ్యాన్ని నెరపడం లేదని వాదించారు.

వియత్నాంలో యుద్ధం కొనసాగడం ప్రమాదకరమని తాము విశ్వసిస్తున్నామని, యుద్ధం కొనసాగింపు అసంభవనీయ ఫలితాలను తీసుక రావచ్చునని ఆయన అన్నారు.

వియత్నాం విషయంలో ఇతర దేశాలు అనుసరించిన విధానాన్ని భారతప్రభుత్వం ఎందుకు అనుసరించలేదని ఒక సభ్యుడు ప్రశ్నించగా తటస్థదేశాల త్రిపక్ష సమావేశంలో వియత్నాంలో శాంతి సాధనకై ఉమ్మడి నివేదికను సమర్పించాయని శ్రీ చాగ్లా అన్నారు.

ఈ అంశంపై శ్రీ భూపేష్‌గుప్తా లేచి సోవియట్ ప్రధాని కొసిగిన్ ఐక్య అరబ్ రిపబ్లిక్‌లో పర్యటించిన సందర్భంగా అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్ వియత్నాం సమస్యపై నిర్దిష్ట ప్రకటనలు చేశారని, కాని భారత ప్రభుత్వం అలాంటి నిర్దిష్ట ప్రకటనలు చేయలేదని తెలిపారు.

ఐక్య అరబ్ రిపబ్లిక్, యుగోస్లావియాలు ఈ సమస్య పట్ల అనుసరిస్తున్న మార్గాన్నే భారత ప్రభుత్వం అనుసరిస్తున్నదని శ్రీ చాగ్లా సమాధానం ఇచ్చారు.

లిషావ్ చీ నిర్మూలనకు మావో ముఠా యత్నం

పెకింగ్ రేడియో ప్రకటన

హాంగ్‌కాంగ్, ఏప్రిల్ 8

చైనా అధ్యక్షుడు లిషావ్‌చీని "నిర్మూలించడానికి" మావో ప్రయత్నిస్తున్నాడని పెకింగ్ రేడియో నేడిక్కడ ప్రసారం చేసింది.

"తనకు ప్రముఖ ప్రతిద్వంద్విగా ఉన్న లిషావ్‌చీని, అసంఖ్యాకంగా ఉన్న ఆయన అనుచరులను నిర్మూలించే తీవ్రమైన లక్ష్యాన్ని మావో ఎదుర్కొంటున్నారు" అని ఈ రేడియో ప్రకటించింది.

ఈ లక్ష్య సాధనలో మావో విఫలమైతే చైనాలో పెట్టుబడిదారీవిధానం పునఃప్రతిష్ఠించబడి లక్షలాది మంది తలలు నేలకొరగడానికి కారణమౌతుందని ఈ రేడియో పేర్కొనది.

చైనా అధ్యక్షునిపై మావో ముఠా దాడి ఉధృతి

పెకింగ్, ఏప్రిల్ 7

చైనా అధ్యక్షుడు లిషావ్‌చీని కాగితపు పులి అంటూ చైనా నేడు అధికారికంగా విమర్శించింది.

గతంలో చైనా ఈ పదాన్ని అమెరికాను, పశ్చిమదేశాల అణ్వస్త్రబలాన్ని, సోవియట్‌ను దూషించడానికి మాత్రమే ఉపయోగించేది.

జనసంఘ్ సభ్యుని అరెస్టు ఉదంతం

పార్లమెంటు హక్కుల కమిటీకి నివేదన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

పార్లమెంటు సభ్యుడు స్వామీ బ్రహ్మానంద్‌ను సభా భవనం వెలుపల బుధవారం అరెస్టు చేసిన విషయాన్ని అధికారులు లోక్ సభా స్పీకరుకు తెలియజేయడంలో విఫలమైనందుకు దాన్ని సభా హక్కుల కమిటీకి నివేదించారు.

జనసంఘ్ నాయకుడు శ్రీ ఎ. బి. వాజపాయ్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది.

నాగా విద్రోహులకు చైనాలో గెరిల్లా శిక్షణ?

మణిపూర్ రాష్ట్రంలో విద్రోహచర్యల ఉధృతికి నాగా, మిజో విద్రోహులఒప్పందం

ఇంఫాల్, ఏప్రిల్ 7

దాదాపు 3 వందలమంది నాగావిద్రోహులు గెరిల్లా పోరాటంలో శిక్షణ పొందేందుకు, ఆయుధాలు మందుగుండు సామగ్రిని సంపాదించేందుకూ ఎగువ బర్మాగుండా చైనాకు వెళ్ళారని విశ్వసనీయమైన సమాచారం నేడిక్కడికి అందింది.

ఎగువబర్మాలో బర్మా సైనికులు ఈ నాగవిద్రోహులను నిరోధించారని ఈ సందర్భంగా జరిగిన పోరాటంలో నాగా విద్రోహులు కొందరు మరణించినప్పటికీ, మిగిలిన వారుతప్పించుకొని చైనాకు పోగలిగారని ఈ వార్తలు తెలుపుతున్నాయి.

మణిపూర్‌రాష్ట్రంలోని చూరాచాంద్‌పూర్, టింగ్నోపాల్, ఉక్రుల్, మావో, టమెంగ్‌లాంగ్, సబ్‌డివిజన్లలో విద్రోహ చర్యలను ఉధృతంచేయడానికి అజ్ఞాత నాగాలు, మిజో విద్రోహులతో ఒప్పందానికి వచ్చారని సైతం విశ్వసనీయంగా తెలుస్తున్నది.

నాగావిద్రోహుల కాల్పులు

జోర్హాట్, (అస్సాం) ఏప్రిల్ 8

నాగాలాండ్ సరిహద్దుల్లోని సిబిసాగర్ జిల్లా దుయాంగ్‌లో రిజర్వు అడవులకు సర్వే చేస్తున్న అస్సాం ప్రభుత్వ సర్వేబృందంపై నాగా విద్రోహులు కాల్పులు జరిపినట్లు నేడిక్కడికి సమాచారం అందింది.

రాష్ట్ర రైతుసంఘ కార్యవర్గం డిమాండు

(1 వ పేజీ తరువాయి)

నించింది.

ప్రస్తుత భూమిశిస్తు చట్టం స్థానే మరింత అభ్యుదయకరమైన వ్యవసాయ ఆదాయ పన్ను చట్టాన్ని వుంచాలని కార్యవర్గం డిమాండ్ చేస్తూ తీర్మానించింది.

అదనపు నిధులు

నాగార్జునసాగర్, పోచంపాడు, తుంగభద్ర ఎగువ కాలువ రెండవ దశకు అదనపు నిధులు కేటాయించాలని మరొక తీర్మానంలో తీర్మానించింది.

వ్యవసాయరంగానికి సరఫరాచేసే విద్యుత్తో యూనిట్‌కు 50 శాతం, అనగా, 8 పైసలనుండి, 12 పైసల వరకు, సంవత్సరానికి ప్రతి హార్స్‌పవర్‌కు 25 రూపాయల నుండి 30 రూపాయలవరకు కనీస ఛార్జిని పెంచాలన్న ప్రతిపాదనకు కార్యవర్గం నిరసన తెలియచేస్తూ, యీ రేట్లను వసూలు చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తూ మరో తీర్మానాన్ని ఆమోదించింది.

నల్గొండ జిల్లా, మహబూబ్ నగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని కొన్ని తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని మరో తీర్మానాన్ని ఆమోదించింది. వ్యవసాయ కార్మికులు, యితర నిరుద్యోగులకు పని కల్పించడానికి సహాయ కార్యక్రమాలు ప్రారంభించాలని యీ తీర్మానంలో తెలిపింది.

బావులు త్రవ్వించుకోవడానికి, వున్న వాటిని లోతు చేయించడానికి పేదలా రైతులకు ప్రత్యేక తక్కావి ఋణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. కరువు ప్రాంతానికి గురిఅయిన ప్రాంతాలలోనూ, కొరత ప్రాంతాలలోనూ చౌకడిపోలు తెరవాలని డిమాండ్ చేసింది. అవసరమైన చోట పశువులకు గ్రాసం సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

కరువు ప్రాంతాలకు, కొరత ప్రాంతాలకు గోధుమ, జొన్న సరఫరా ఆగిపోయిందనీ, తిరిగి వీటిని ఆ ప్రాంతాలకు సరఫరా చేయించాలని కార్యవర్గం డిమాండు చేస్తూ తీర్మానించింది.

పంచదార ఫ్యాక్టరీలకు సరఫరా చేయబడే చెరకు ధరను పెంచాలనీ, చెరకు ధర మీద విధించే ఎక్సయిజ్ డ్యూటీ 50 శాతం తగ్గించాలని డిమాండు చేసింది.

జార్ఖండ్ రాయ్‌కు ఆహార మంత్రిత్వశాఖ

ఉత్తరప్రదేశ్‌లో మంత్రిత్వశాఖల విభజన

లక్నో, ఏప్రిల్ 7

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ పతనానంతరం ఏర్పడిన ఐక్య సంఘటన ప్రభుత్వంలో మంత్రిత్వశాఖలను ఈ క్రింది విధంగా విభజించారు.

శ్రీ చరణ్‌సింగ్ : ముఖ్యమంత్రి, హోం శాఖ, ప్లానింగ్, సాధారణపాలనా నిర్వహణ.

శ్రీరామ్ ప్రకాశ్ (జనసంఘ్) : విద్యా, సాంస్కృతిక వ్యవహారాలు, శాస్త్రీయ పరిశోధనలు.

శ్రీరామ్‌చంద్ వికల్ (ఇండి) పశుసంవర్ధకశాఖ. మత్స్యశాఖ. అడవులు.

శ్రీ జైరామ్‌వర్మ (జనకాంగ్రెస్) ; వ్యవసాయం: పంచాయతీరాజ్.

శ్రీ జార్ఖండ్‌రాయ్ (కమ్యూనిస్టు) : ఆహారశాఖ, పౌర సరఫరా శాఖ.

శ్రీ ప్రభునారాయణ్‌సింగ్ : (ఎస్. ఎస్. పి.) పరిశ్రమలు, కార్మికశాఖ.

శ్రీ గంగాభక్తి సింగ్ (జనసంఘ్) సహకార సంఘాలు.

శ్రీ ఆదిత్ నారాయణ్ శర్మ (జనకాంగ్రెస్) రివెన్యూ. పునరావాసశాఖ సహాయ కార్యక్రమాలు.

శ్రీ తాంబరేశ్వర్ ప్రసాద్ (జనసంఘం) ఇరిగేషన్. విద్యుచ్ఛక్తి.

శ్రీ ప్రతాప్ సింగ్ (పి. యస్. పి.) వైద్య, ఆరోగ్యశాఖలు.

శ్రీ మంగల్‌దేవ్ విశారద్ (ఎస్. ఎస్. పి.) పి. డబ్లు. డి.

శ్రీ అఖ్తర్ ఆలి (స్వతంత్ర) ఎక్సైజ్. ముస్లిం వక్ఫ్.

శ్రీ శ్యాంలాల్ యాదవ్ (జనకాంగ్రెస్) న్యాయ, సమాచార శాఖలు.

శ్రీ సింగ్ జాతవ్ (జనసంఘం) రవాణా యాతలు.

శ్రీ బర్మేశ్వర్ పాండే (జనసంఘం) మున్సిపల్, గృహనిర్మాణం, దేవాలయ ధర్మదాయశాఖ.

భారత్‌లో ఉథాంట్ కార్యక్రమం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

భారత్ పర్యటన నిమిత్తం ఐరాస ప్రధాన కార్యదర్శి ఉథాంట్ సోమవారం సాయంత్రం ఇక్కడకు వస్తారు.

ఉథాంట్ ఢిల్లీలో నాల్గు రోజులపాటు వుంటారు. ఆయన ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీతోనూ, విదేశాంగ మంత్రి శ్రీ ఎం. సి. చాగ్లాతోనూ చర్చలు జరుపుతారు.

భారత నాయకులతో ఆయన ప్రధానంగా వియత్నాం సమస్యా పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చిస్తారు.

ఏప్రిల్ 12న ఆయన నెహ్రూ అవార్డును స్వీకరిస్తారు. అదే రోజున రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను కలుసుకుంటారు.

రాష్ట్రపతి, ప్రధాని, విదేశాంగ మంత్రి ఆయన గౌరవార్థం చేసే విందులలో ఆయన పాల్గొంటారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనకు ఏప్రిల్ 11 న గౌరవ డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

ఉథాంట్ ఏప్రిల్ 13 న నేపాల్ వెళ్ళి అక్కడ రెండు రోజులపాటు వుంటాడు.

ఆర్. టి. సి. కార్మికుల నిరశనదీక్ష విరమణ

(1వ పేజీ తరువాయి)

భృతి ఇవ్వాలన్న కార్మికుల కోర్కెలను సాధించుకోవడానికి నిరవధికసమ్మె తప్పనిసరి అయిందని మఖ్దూం మొహియుద్దీన్ తెలిపారు.

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి వస్తున్న వార్తలబట్టి నిరాహారదీక్ష ప్రోత్సాహకరంగా వున్నట్లు తెలుస్తున్నదని ఆయన అన్నారు. అనేకమంది కార్మికులు సమ్మె బ్యాలెట్‌లో పాల్గొంటున్నారని అన్నారు. వచ్చేవారం ఆర్. టి. సి. కార్మిక సంస్థ కేంద్ర కమిటీ సమావేశం జరుగుతుందనీ, సమ్మెకు సంబంధించి అక్కడ ఒక నిర్ణయం చేస్తామని ఆయన అన్నారు. సమ్మె ప్రారంభించే రోజున ఆఖరు క్షణంలోనైనా యూనియన్ సంప్రదింపులకు సిద్ధంగా వుంటుందని ఆయన అన్నారు. సమ్మెనోటీసు త్వరలోయిస్తామని అన్నారు.

నిన్నటిదాకా కార్మిక సంస్థలలో ముఖ్యమైన పదవులతో వుంటూ, ఐ. యన్. టి. యు. సి వర్గంతో కుమ్మక్కై కార్మికసంస్థ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి కొందరు బయటికి వెళ్ళారని ఆయన అన్నారు.

ఈ విచ్ఛిన్నకులపై కేంద్రకమిటీ తగు చర్య తీసుకొంటున్నదని అన్నారు,

ఈ ముఠా గూండాగిరికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆర్. టి. సి. యూనియన్ జిందాబాద్, తాత్కాలికభృతి మంజూరు చేయాలి. విచ్ఛిన్నకులు నశించాలని కార్మికులు నినాదాలిచ్చారు.

సికింద్రాబాద్ డిపోలో జోశ్యభట్ల ప్రభృతుల ప్రసంగం

సికిందరాబాద్ డిపోలో జరిగిన ఆర్. టి.సి. ఉద్యోగుల సభలో, ఎ.పి. సి. టి. యు. సి. కార్యదర్శి శ్రీ జోశ్యభట్ల సత్యనారాయణ ఎ.పి.యస్. ఆర్.టి.సి. ఉద్యోగుల యూనియన్ వర్కింగ్ కమిటీసభ్యులు శ్రీ హరిహరరావు ప్రసంగించారు.

దిల్‌సుక్ నగర్ డిపోవద్ద ఆర్.టి.సి. ఉద్యోగులు యూనియన్ కార్యదర్శి శ్రీ వై.వి. రావు ప్రసంగించారు.

బరకత్‌పూర్ డిపోవద్ద శ్రీ అమ్‌లోక్‌రామ్ ప్రసంగించారు. సచివాలయంముందు నిరాహారదీక్ష కొనసాగించిన ఎ. పి. యస్. ఆర్. టి. సి. తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. రాములు దీక్ష విరమించారు.

ఏలూరులో కేంద్రకమిటీ సమావేశం

ఈనెల 11 న ఏలూరులో జరుగనున్న ఆర్. టి. సి. కార్మికసంస్థ కేంద్రకమిటీ సమావేశం యీనెల 12 న గూడా జరుగుతుందని, ప్రస్తుతపరిస్థితినిసమీక్షించుతుందని, ఆర్. టి. సి. ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి శ్రీ వై. వి. రావు తెలియజేస్తున్నారు.

సమ్మెకు వసూలుచేసిన 'నిధి'ని అక్కడ సమావేశంలో ఆయా బ్రాంచీల కార్యదర్శులు యివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తొలి వార్తలు

ఏలూరు, ఏప్రిల్ 7

రాష్ట్రంలో వివిధ ఆర్. టి. సి. డిపోలకు చెందిన కార్మికులు తమ వేతనాలలో 30శాతం తాత్కాలిక భృతిని డిమాండ్ చేస్తూ, నిన్న ప్రారంభించిన నిరాహారదీక్ష కార్యక్రమంలో నేడు మరికొంతమంది అదనంగా చేరారు.

ఏలూరు బస్సుస్టాండువద్ద నిన్నటినుంచి జరుగుతున్న నిరాహారదీక్ష కార్యక్రమంలో శ్రీయుతులు యం. యస్. మూర్తి (ఎలక్ట్రిషియన్), యన్. భద్రరాముడు (మెకానిక్) కె. ఆంజనేయులు (డ్రైవరు) నేటినుంచి పాల్గొంటున్నారు.

ఏలూరు ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ కార్యదర్శి శ్రీ అకుల సుబ్బారావు, ఏలూరు 22వ వార్డు ఫ్రెండ్స్ యూనిటీ సెంటరు కార్యదర్శి శ్రీ కోదాడ వెంకటరమణారావు, కోశాధికారి శ్రీ జేరేతి అప్పారావులు నిరాహారవ్రతులను పరామర్శించారు.

రాజధాని నగరంలో

హైదరాబాదు, సికింద్రాబాదులలో వివిధ బస్సు డిపో కేంద్రాలవద్ద 25 మంది కార్మికులకు పైగా నిన్నటినుంచి నిరాహారదీక్షను కొనసాగిస్తున్నారు.

హైదరాబాదుజిల్లా డిపో, బరకత్‌పూరా డిపో, దిల్‌సుకనగర్ డిపో, సికింద్రాబాదు డిపో, సెంట్రల్ వర్కుషాపు, తదితర కేంద్రాలవద్ద కార్మికులు నిరాహారదీక్షను సాగిస్తున్నారు.

ఎ. పి. యస్. ఆర్. టి. సి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ మఖ్దూం మొహియుద్దీన్, సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్‌కార్యదర్శి శ్రీ అమ్‌లోక్‌రామ్, యూనియన్ కార్యదర్శి శ్రీ వై. వి. రావులు వివిధ నిరాహార దీక్ష శిబిరాలవద్దకు వెళ్ళి, నిరాహార వ్రతులను పరామర్శించారు. కార్మికులను ఉద్దేశించి ప్రసంగాలు చేశారు.

కార్మిక నాయకుల పరామర్శ

శాసనసభ్యులు శ్రీ చిట్టూరి ప్రభాకరచౌదరి ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ జోశ్యభట్ల సత్యనారాయణలు నిన్న నిరాహార వ్రతులను పరామర్శించారు.

శ్రీ యుతులు వీరాస్వామి, (ప్రభుత్వ ప్రెస్ వర్కర్సుల యూనియన్ ప్రధాన కార్యదర్శి). అమ్‌లోక్‌రాం (సి. డబ్ల్యు. డి. వర్కుషాపు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి), ముబారక్ (జిందా ఇస్లాయత్ వర్కర్సు యూనియన్‌కార్యదర్శి) రవ్వ. వెంకటస్వామి (సి. డబ్ల్యు. డి. వర్కర్సు యూనియన్ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి), రాములు (కొత్తగూడెం కాలరీస్ ఐ. యన్. టి. యు. సి. వర్కర్సు యూనియన్), వి. భావనాచారి (చక్కర్ నగర్ వర్కర్సు యూనియన్ కార్యదర్శి), జి. రామచందర్ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి)లు నిరాహార వ్రతం సాగిస్తున్న యూనియన్ నాయకులు శ్రీ ఎ. రాములును అభినందించారు.

నీరసిస్తున్న శ్రీ ఆండ్రూ జోసఫ్ ఆరోగ్య పరిస్థితి

ముషీరాబాద్‌లోని పాలక కార్యాలయం వద్ద నేటికి నాలుగు రోజులుగా నిరాహారదీక్ష సాగిస్తున్న ఆర్.టి.సి. ఎంప్లాయీస్ యూనియన్ కోశాధికారి శ్రీ ఆండ్రూ జోసఫ్ ఆరోగ్యం రోజు రోజుకూ నీరసిస్తున్నది.

ఇతనిలో టైఫాయిడ్ లక్షణాలు గోచరిస్తున్నవని నిన్న ఆయనను పరీక్షించిన డాక్టరు తెలిపారు. శ్రీ జోసఫ్ ఆరోగ్యం పట్ల కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

శ్రీ మఖ్దూం పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 7

న్యాయ సమ్మతమైన 30 శాతం తాత్కాలిక భృతి డిమాండును సాధించుకొనేందుకు నిరవధిక సమ్మెకు సన్నద్ధం కావలసిందిగా ఎ. పి. యస్. ఆర్ టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ మఖ్దూం మొహియుద్దీన్ నేడిక్కడ కార్మికప్రదర్శననుద్దేశించి ప్రసంగిస్తూ విజ్ఞప్తి చేశారు.

యూనియన్ ప్రతినిధుల, మేనేజిమెంటు మధ్య జరిగిన సంప్రదింపులు ఫలప్రదం కాలేదని, మేనేజిమెంటు మొండి వైఖరిని అవలంబిస్తున్నదని ఆయన అన్నారు.

కార్మికులు, మేనేజిమెంటు దయాధర్మాన్ని కోరడంలేదని, కార్మికులు తమ హక్కులను డిమాండు చేస్తున్నారని ప్రకటించగానే కార్మికులు హర్షధ్వానాలు చేశారు.

రు. 2 కోట్ల 40 లక్షల పన్ను చెల్లించాలని అడిగిన సందర్భంగా కార్పొరేషన్ యే రకమైన నిరసనను తెలుపలేదు కానికార్మికుల న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించడానికి ఆర్థికంగా నష్టం వస్తున్నదని కార్పొరేషన్ వాదిస్తున్నదని అన్నారు.

కార్మికులు చైతన్యవంతమైన పోరాటాన్ని సాగించడంద్వారా తమడిమాండ్లను సాధించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికవర్గం ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి శ్రీరామమోహనరావు నాయకత్వాన కొంతమంది సాగిస్తున్న యూనియన్ వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కోవాలని అన్నారు.

ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ కె. యల్. మహేంద్ర, యూనియన్ కార్యవర్గ సభ్యులు శ్రీ హరిహరరావులు ప్రసంగించారు.

శ్రీ రామమోహనరావు ప్రభృతుల దౌర్జన్య చర్యలు

శ్రీ రామమోహనరావు ముఠా, ఐ. ఎన్. టి. యు. సి. లోని కొందరి నాయకత్వాన కొందరు నిన్న నిరాహార వ్రతులపై రాళ్ళు విసిరారు.

సెంట్రల్ వర్కుషాపులో కొంత మంది యూనియన్ విచ్ఛిన్న కారులు, ఐ. యన్. టి. యు. సికి చెందిన వారు ఒక కమిటీగా యేర్పడ్డారు. దీనిలో యూనియన్‌లో నుంచి బహిష్కరింపబడినవారు. అసంతృప్తి జీవులు చేరారు. వీరు కొద్దిమందితో నిన్న ఒక ఊరేగింపును జరిపి ముఖ్యమంత్రి, నివాసం వద్దకు చేరుకొని ఆశ్చర్యకరమైన విధానాన్ని అవలంబించారు.

వీరు అనుసరించిన పద్ధతులకు కార్మికులు కోపోద్రిక్తులయ్యారు. శ్రీ రామమోహనరావు అనుసరిస్తున్న విచ్ఛిన్నకర, దౌర్జన్య విధానాన్ని ప్రతిఘటిస్తూ నేటి అపరాహ్నం కార్మికులు ప్రదర్శన జరిపి వారి విచ్ఛిన్నకరపద్ధతులకు సమాధానం చెప్పారు. యూనియన్ ఐక్యతను విచ్ఛిన్నం చేయడం అసాధ్యమని నిరూపించారు.

కార్మికుల పోరాటానికి సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిలు తోడ్పాటు

ఆర్. టి. సి. కార్మికులు సాగిస్తున్న పోరాటానికి నగరంలోని కార్మికుల అండదండ లుంటాయని, హృదయ పూర్వక సహకారం ఉంటుందని సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిలు కార్యదర్శి శ్రీఅమ్‌లోక్‌రాం ప్రకటించారు.

యూనియన్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. రాములు సాగిస్తున్న నిరాహార దీక్ష శిబిరం వద్ద సంఘీభావ ప్రదర్శనలు జరపవలసిందిగా వివిధ కార్మిక శాఖలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజమండ్రి ఆర్ట్సు కళాశాల విద్యార్థి రైలుక్రింద పడి మృతి

రాజమండ్రి, ఏప్రిల్ 7

రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్సు కళాశాలలో మొదటి సంవత్సరం బి. యస్. సి. చదువుతున్న విద్యార్థి శ్రీ రేపకాయల సత్యనారాయణమూర్తి గత రాత్రి 12.45 గంటలకు విజయవాడ - హౌరా ప్యాసింజరు రైలు క్రింద పడి మృతి చెందారు. రైలు క్రింద పడిన ఇతని శరీరం రెండు ముక్కలయింది.

ఇతని వయస్సు 18 సంవత్సరాలు. ఇతని స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం.

శ్రీ కోకాతో ప్రతిపక్షనాయకుల సమావేశం

(1వ పేజీ తరువాయి)

నామినేషన్లు దాఖలు చేశారు.

వీరిలో చౌదరిహరిరామ్ ఒకరు. ఈయన రాష్ట్రపతి పదవికి నామినేషన్ దాఖలు చేయటం ఇది మూడవసారి.

శ్రీ ఖూబీరామ్ అనే మరొకరు నేడు నామినేషన్ దాఖలు చేశారు.

నిన్న శ్రీయుతులు ఎం. సి. డావర్, ఎ. ఎస్. సింగ్‌లు నామినేషన్లు దాఖలు చేయటం విశాలాంధ్ర పాఠకులకు విదితమే.

యం. ఎ. పరీక్షల తేదీలలో మార్పు

వాల్తేరు, ఏప్రిల్ 8

ఆంధ్ర యూనివర్శిటీ యం. ఎ. డిగ్రీ మొదటి, చివరిసంవత్సరాల పరీక్షల ప్రారంభమయే తేదీలు ఈ క్రింది విధంగా మార్చబడ్డాయి.

యం. ఎ. మొదటి ఏడు - ఏప్రిల్ 24.

యం. ఎ. చివరి ఏడు - మే 1.

పరీక్షలు ప్రారంభానికి మూడురోజులు ముందుగా విద్యార్థులు కాలేజి ఆఫ్ ఆర్ట్స్, లా అండ్ కామర్సు, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్ వాల్తేరును కలుసుకొని సరియైన గుర్తింపు సర్టిఫికెట్‌ను చూపి చీఫ్ సూపరింటెండెంట్ నుండి హాల్‌టిక్కెట్లను వ్యక్తిగతంగా తీసుకోవాలి.

విజయవాడ, తిరువూర్లలో మరికొందరి నిరశనం

విజయవాడ, ఏప్రిల్ 8

ఆర్. టి. సి. ఉద్యోగులు తమ కోర్కెల సాధనకై విజయవాడ బస్‌స్టాండ్‌లో కొనసాగిస్తున్న నిరాహారదీక్షలో నేడు మూడవ రోజు కొత్తగా ఎన్. సుబ్బారావు (కండక్టర్); ఎస్. వి. ఆర్. స్వామి (కండక్టర్) చేరారు.

తిరువూరు డిపోవద్ద కొనసాగుతున్న నిరాహారదీక్షలో నేడు శ్రీ పి. వెంకయ్య, ఎ. యతిరాజులు (డ్రైవర్) ఎస్. వి. వర్ధనరావు (కండక్టర్) చేరారు.

దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సంఘం. సికింద్రాబాద్‌శాఖ సర్వసభ్య సమావేశం గత వారంలో జరిగింది.

టెండరు నోటీసు

పెదముత్తేవి గ్రామ పంచాయితీ.

కృష్ణాజిల్లా దివితాలూకా. పెదముత్తేవి గ్రామ పంచాయితీ ఏరియాలో గల యీ దిగువ సుదహరించిన పనులు చేయుటకు సీలువేసిన టెండర్లు ది 15-4-1967 వ తేదీ సాయంత్రము 4 00 గంటల వరకు ఈ పంచాయితీ ఎగ్జిక్యూటివు ఆఫీసరుగారిచేగాని, లేక వారి అనుమతి పొందినవారిచేగాని టెండర్లు తీసికొనబడి, అదేరోజు సాయంత్రం 4.30 గంటలకు హాజరైన టెండరుదార్ల యెదుట తెరువబడును. డిపాజిట్టు కట్టని టెండర్లు అంగీకరింపబడవు. తదితర వివరములు ఆఫీసు పనిచేయు కాలములో తెలిసికొనవచ్చును.

వరస నెం.	పని వివరము		ఎస్టిమేటు మొత్తము	కట్టవలసిన డిపాజిట్టు
			రు. పై	రు. పై
1.	కోరడిదొడ్డి బజారులో	రబ్బిస్ రోడ్డు వేయుట	2100.00	105.00
2.	ముత్తేవివారి వీధిలో	„	1800.00	90.00
3.	దాసయ్యవీధిలో	„	500.00	25.00
4.	ముత్తన్నవీధిలో	„	550.00	27.50
5.	శ్రీ లక్ష్మీపతిస్వామివారివీధిలో	„	400.00	20.00
6.	రాజులవీధిలో	„	1450.00	72.50
7.	గౌతవారివీధిలో	„	550.00	27.50
8.	లింగమనేనివారివీధిలో	„	1100.00	55.00
9.	రామాలయంవీధిలో	„	1550.00	77.50
10.	గోవాడవారివీధిలో	„	1300.00	65.00
11.	మాలపల్లి బ్రాంచివీధి	„	700.00	35.00
12.	మురారివారివీధిలో	„	1100.00	55.00
13.	మెరకవీధిలో	„	1300.00	65.00
14.	చీకాలవారి చెరువులో పట్టీపని చేయుట		5000.00	250.00
15.	సంతోషపురములో 4'.00" యీ మీటరు గల సిమ్మెంటు వర్రల కావి దింపుట		700.00	35.00
			20,100.00	1,005.00

నోటు : ఈ పంచాయితీలో పెండింగుపనులున్న కంట్రాక్టర్ల టెండర్లు తీసికొనబడవు

(సం) సి హెచ్. వీరభద్రయ్య శర్మ,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
గ్రామ పంచాయితీ,
పెదముత్తేవి (కృష్ణా జిల్లా)

for acidity indigestion constipation

3

SOVEREIGN REMEDIES OF

SADHANA

భాస్కర్ లవణ

అమ్లపిత్తము, వాయురోగము, మలబద్ధకము, గుండె మంటకు అతి ప్రసిద్ధమైనది. జీర్ణశక్తిని వృద్ధిపరచి విరేచనకారిగా పనిచేయును. అజీర్ణ రోగము లన్నింటికీ మంచి ఆయుర్వేద మందు.

అష్టాంగ లవణ

అజీర్ణమునకు, అకలి మందగించుట. అరుచి, పొట్ట భారంగావుండుట, చురుకుతనము లేకపోవుట మొదలైన వాటిని నిరోధించుటకు అమోఘమైన ఔషధము. జీర్ణశక్తిని పెంపొందించి, ఆహారమందు ఋచి కలిగించును.

హరితకి ఖండ

మల బద్ధముచే దెబ్బతిన్న పొట్టను సాఫీగా పనిచేయునట్లుచేయును. ప్రేగుల గమన గతిని సక్రమముగా వుంచి మల బద్ధము పూర్తిగా పోగొట్టును.



అధ్యక్ష —
డా. జోగేష్‌చంద్ర ఘోష్. ఎం. ఏ.
ఆయుర్వేదశాస్త్రి. F.C.S. (London)
M. C. S. (America)
భగల్పూర్ కాలేజీలో
పూర్వపు కెమిస్ట్రీ ప్రొఫెసరు

కలకత్తా సెంటరు:
డా. నరేష్ సి. హెచ్. ఘోష్,
M. B. BS. (Cal) ఆయుర్వేదాచార్య

సాధనా
ఔషధాలయం
ఢక్కా

సాధనా ఔషధాలయ రోడ్
సాధనా నగర్, కలకత్తా - 48

ఆంధ్రకు సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
శ్రీనివాస మెడికల్ అండ్
ఫ్యాన్సీ మార్ట్
తెనాలి P.O., గుంటూరుజిల్లా (ఆం.ప్ర.)

రేడియో

సోమవారం — ఏప్రిల్ 10
శక 1889 ★ చైత్ర 20

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-00 వందేమాతరం- శుభోదయం-ప్రసారవిశేషాలు; 6-10 భక్తిరంజని: 6-40 ఆం.వా; 6-45 సూక్తిముక్తావళి; 6-50 బజారుధరలు; 6-55 నవారంభం; 7-00 తె. వా: 7-15 ఉగాది గేయాలు; 7-30 సంస్కృత పాఠము; 7-45 సంగీత శిక్షణ (జూనియర్లకు); 8-00 ఆం. వా: 8-15 హిం. వా; 8-30 హైదరాబాద్ వలె; 9-00 అష్టావధానం - కోట వీరాంజనేయశర్మ; 10-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికుల కార్యక్రమం: 1-00 వయొలిన్: ద్వారం వెంకటస్వామినాయుడు; 1-30 ఆం. వా; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 ఉగాది ఊహలు; 2-30 భక్త ప్రహ్లాద - సంక్షిప్త శబ్దచిత్రం; 3-45 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 లలిత సంగీతం; 5-50 పంచాంగ శ్రవణం; 6-00 ఆం. వా; 6-05 ప్రాం. వా; 6-15 వాద్య బృందం; 6-25 ముఖ్య ప్రకటనలు; 6-30 పంటసీమలు; 7-00 తె. వా: 7-15 గాంధీజీ ఆత్మకథ పఠనము; 7-30 సంవత్సరాది సమాలోచన-రూపకం; 7-45 ఉగాది పాటలు; 8-00 వయొలిన్; 8-45 చిత్రతరంగిణి; 9-00 ఆం. వా; 9-15 వార్తలు; 9-20 విరామ సంగీతము; 9-30 నాటక సప్తాహం; 10-30 ఆం. వా: 10-35 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - (ఎ)

405.4 మీ. (740 కిలోసై.)

ఉదయం: 6-00 వందేమాతరం-మంగళ ధ్వని; 6-10 భక్తిరంజని; 6-40 ఆం. వా; 6-45 సూక్తిముక్తావళి; 6-50 వాద్యగోష్ఠి; 7-00 తె. వా; 7-15 ఉగాది గేయాలు; 7-30 సంస్కృత పాఠము; 7-45 శాస్త్రీయ సంగీత్; 8-00 ఆం. వా: 8-15 హిం. వా: 8-30 వి. లక్ష్మి; 9-00 అష్టావధానం; 10-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 1-00 వి. లక్ష్మి; 1-30 ఆం. వా: 1-40 చిత్రసీమ; 1-50 తె. వా: 2-00 జ్ఞానసుధ; 2-30 భక్త ప్రహ్లాద - సంక్షిప్త శబ్ద చిత్రం; 3-54 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు- 5-35 లలిత సంగీతం; 5-50 పద్యపఠనం; 6-00 ఆం.వా: 6-05 ప్రాం. వా: 6-15 ప్రాం. వా-ఉర్దూ; 6-25 ముఖ్య ప్రకటనలు; 6-30 వ్యావసాయిక విషయాలు; 7-00 తె. వా; 7-15 ఆత్మకథ-మహాత్ముని స్వీయచరిత్ర పఠనము; 7-30 వికాసతరంగిణి; 7-45 చిత్రసీమ; 8-30 ఆటలసమీక్ష 8-40 కీర్తనలు; 9-00 ఆం. వా: 9-15 వార్తలు; 9-20 విరామ సంగీతం; 9-40 రేడియో నాటక సప్తాహం; 10-30 ఆం. వా: 10-35 హిం. వా; 10-40 జన గణ మన - ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ. (900 కిలో సై)
సా॥ 5-30 నుండి రాత్రి 10-40 వరకు
శనివారములు మాత్రం
సా॥ 5-30 నుండి రా॥ 11-10 వరకు

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)
సా॥ 5-30 నుండి రా॥ 10.40 వరకు

హైద్రాబాద్ - (బి)

283 మీ (1060 కిలో సై.)

మధ్యాహ్నం: 2.00 వాద్య సంగీతం; 2-10 ఉ. వా: 2.20 సుగం సంగీత్, 2-30 బచ్చోం కేలియే; 3.00 ప్రసార సమాప్తి.

సాయంత్రం; 8.00 కన్నడ కార్యక్రమం; 8-30 శ్రోతలు కోరిన పాటలు; 9.00 వయొలిన్; 9-15 ఉ. వా; 9-30 ఉర్దూలో కార్యక్రమము; 10.00 ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై)

ఉదయం: 6.00 వందేమాతరం, మంగళ గానం; 6.40 ఆం.వా; 6.45సంగీతామృతం; 7.00 తె. వా; 7-15 ఇకై కోలం; 7-30 ఉగాది, పొగడలు రగడలు - సంగీతరూపకం; 8.00 ఆం. వా; 8.15 ఆటవిడుపు; 8.45 స్త్రీల కార్యక్రమం; 9.45 ప్రసార సమాప్తి.

(41.90 మీ 7160 కిలోసై)

మధ్యాహ్నము: 11.55 ప్రాంతీయ కేయిదిగళ్; 1.00 ఆంగ్లం; 1.30 ఆం. వా; 1.40 హిం. వా; 1.50 తె. వా; 2.00 పిన్ని - సంక్షిప్త శబ్ద చిత్రం; 3.00 ప్రసార సమాప్తి.

(5.30 నుండి 6.40 వ॥ 60.98 మీ.గూడా)

సాయంత్రం:5.30 ఆంగ్లం;6.00ఆం.వా; 6.15 ప్రాంతీయ కేయిదిగళ్; 6.15 విరామ సంగీతం; 6.20 స్థానిక ప్రకటనలు; 6.45 ఎన్. రామస్వామి; 7.00 తె. వా; 7.15 చిత్రగానం; 7.30 గీతమాలిక; 8.00 ఆంగ్లం; 8.15 మధ్య సంగీతం; 8.30 ఫి. రిలే, 8.45 వాద్య సంగీతం; 9.00ఆం. వా; 9.15 వార్తలు; 9.20 విరామ సంగీతం: 9.30 9.30 తెర - నాటిక; 10.30 ఆం. వా; 10.35 వాతావరణ సూచన - జన గణ - మన - సమాప్తి.

గుంటూరుజిల్లాలోని వంతరావూరు పంచాయితీ సర్పంచ్ శ్రీ జరుగల వెంకట రమణయ్య రిట్‌పిటిషన్‌ను హైకోర్టు అంగీకరించింది.

ఏడెన్ నుండి ఐ. రా. స. పరిశీలన బృందం నిష్క్రమణ

బ్రిటిష్ అధికారుల సహాయ నిరాకరణ ఫలితం

ఏడన్, ఏప్రిల్ 7

ప్రస్తుతం బ్రిటన్ వలసగావున్న దక్షిణ అరేబియా ప్రాంతానికి శాంతియుతంగా స్వాతంత్ర్య ప్రదానంచేసే విషయంలో యధార్థ విషయాలను పరిశీలించడానికై వచ్చిన ఐరాస పరిశీలక బృందానికి బ్రిటిష్ అధికారుల సహాయ నిరాకరణ ఫలితంగా ఆ బృందం ఏడెన్‌లో తమ పర్యటనను రద్దు చేసుకొని రోమ్‌కు తిరిగి వెళ్ళింది.

ముగ్గురు సభ్యులుగల ఈ బృందం ఏడెన్‌లో మూడు వారాలపాటు పర్యటించవలసి వుంది. కానీ బ్రిటిషు ఉద్యోగుల సహాయ నిరాకరణ ఫలితంగా ఈ బృందం ఐదు రోజులకే తిరిగి పోవలసి వచ్చింది.

ఈ బృందం సభ్యుడు అబుల్ షాలీష్ (ఆఫ్ఘనిస్తాన్) తాముబయలుదేరి వెళ్ళేముందు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికంగా రక్తపాతం జరగడానికి అందరికంటే బ్రిటనే కారణమని అన్నారు.

ఈ అయిదు రోజుల్లోనైతేం ఏడెన్‌లో బ్రిటిష్ ఉద్యోగులు రెచ్చగొట్టిన సమ్మెలూ, హింసాకాండ ఫలితంగా ఈ బృందం తన విధులను ఏమాత్రమూ నిర్వహించలేకపోయింది.

ఈ బృందం నాయకుడు మెనిల్ పెరెజ్ గ్యెరేరాల్ (వెనిజులా) ఏడెన్ ప్రజల నుద్దేశించి టెలివిజన్‌లో మాట్లాడడానికి బ్రిటిష్ అధికారులు అనుమతి నిరాకరించారు.

ఈ బృందాన్ని జాతీయ పార్టీలునైతం బహిష్కరించాయని రాయిటర్ విలేకరి రాస్తున్నాడు.

ఈ బృందం ఏడెన్ వదలివెళ్ళడంతో గత ఆరురోజులుగా కొనసాగుతున్న సమ్మెను ఉపసంహరించుకోవలసినదిగా ఏడెన్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ పిలుపిచ్చింది. ఈ బృందం ఏడెన్‌లోవున్న సమయంలో కార్మికులు దేశవ్యాపితంగా సమ్మె కొనసాగించి పౌరజీవితాన్నంతా స్తంభింపచేశారు.

ఈ బృందం ఇక్కడ వున్నకాలంలో బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలు పెల్లుబికాయి. ఈ సందర్భంగా ఏడెన్‌లో జరిగిన కాల్పులు, చేతిబాంబులు విసిరిన సంఘటనల్లో 8 మంది అరబ్బులు మరణించారు. 14 మంది బ్రిటిష్ సైనికులతోసహా 45 మంది ప్రజలు గాయపడ్డారు.

దర్యాప్తుకు బ్రిటన్ ఆదేశం

ఐ. రా. స. పరిశీలక బృందం నాయకునికి టెలివిజన్‌లో ప్రసంగించడానికి అనుమతి నిరాకరించిన ఉదంతంపైన దర్యాప్తు జరపవలసిందిగా బ్రిటన్ విదేశాంగ మంత్రి జార్జి బ్రౌన్ ఆదేశించారు.

ఈ బృందం ఏడెన్‌నుండి తిరిగి వెళ్ళిపోయినందున కలిగే పరిణామాల గురించి బ్రిటిష్‌ప్రభుత్వం తిరిగితక్షణపరిశీలన జరుపుతున్నదని విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లండన్‌లో చెప్పారు.

ఈ బృందం తన విధులను పూర్తిచేయకుండానే వెళ్ళిపోవడంపట్ల బ్రిటిష్‌ప్రభుత్వం విచారం తెలుపుతూ ప్రకటించింది.

ఊథాంట్‌తో భేటీ

ఏడెన్‌నుండి తిరిగివచ్చిన ఐరాస పరిశీలక బృందంతో ఐరాస ప్రధాన కార్యదర్శి ఊథాంట్ నిన్న రాత్రి రోమ్‌లో 40 నిమిషాల పాటు సంభాషించారు.

ఈసమావేశ నంతరం ఊథాంట్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ "మేముపరస్పరం అభిప్రాయాలను తెలుపుకున్నాం. వాటిలో నిర్దిష్టమైనదేదీ లేదు" అనిఅన్నారు.

ఈ సంభాషణల్లో ఏమి నిర్ణయం చేశారన్న దానికి జవాబు చెబుతూ తనకు సంబంధించినంత వరకూ ఎట్టి మార్పులేదన్నారు.

ఈ సమస్యపై సంభాషణలకు లండన్ రమ్మంటూ బ్రిటన్ విదేశాంగ మంత్రి జార్జి బ్రౌన్‌పంపిన ఆహ్వానాన్ని ఈ బృందం అంగీకరిస్తుందో లేదో ఆయన చెప్పలేదు.

ఈ బృందం జెనీవాకు బయలుదేరి వెళుతుందని ఆ బృందం ప్రతినిధి చెప్పారు.

పశ్చిమ బెంగాల్ షెడ్యూల్డుకులాల జాబితా

లోకూరు కమిటీ సిఫార్సుల మేరకు సరిచెయ్యవద్దని విజ్ఞప్తి

కలకత్తా, ఏప్రిల్ 7

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో సంప్రతించకుండా లోకూరు కమిటీ సిఫారసులపై పశ్చిమ బెంగాల్ షెడ్యూల్డు జాతుల, షెడ్యూల్డు తరగతుల జాబితాను సరిచెయ్యవద్దని శాసనసభలో ఫార్వర్డ్‌బ్లాక్ సభ్యులు శ్రీయుతులు అపూర్వలాల్ మజుందార్ అమరేంద్రనాథ్‌రాయ్‌ప్రధాన్‌సిద్ధేంద్రమండల్ కృపాసింధుసాహా నేడు కేంద్ర ప్రభుత్వానికి ఒక సంయుక్త విజ్ఞప్తి చేశారు.

మొదటిసారిగా లోకూర్ కమిటీ సిఫార్సులు తెలియగానే ఆ సిఫార్సులు శాస్త్రీయమైనవి కావనీ, వాటిని త్రోసిపుచ్చవలసిందిగాను కలకత్తాలోని అఖిలపక్ష సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు వారు తెలియచేశారు.

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్ళినప్పుడు ఆ సమస్యను కేంద్రంతో చర్చించాలని కూడా వారు తెలియజేశారు.

వ్యవసాయ వస్తువుల ధరలు

విజయవాడ, ఏప్రిల్ 8

విజయవాడ రీజినల్ అసిస్టెంటు మార్కెటింగ్ డైరెక్టరు నేడు అందచేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలుచేసిన 7-4-67 నాటి టోకుధరలు (ఒక క్వింటాల్ 100 కిలో గ్రాములు లేక 220½ పౌనులు.)

ధాన్యం		75 కి.	100 కి
నంబర్లు :	విజయవాడ	రు. 37-13	49-50
"	కాకినాడ	37-13	49-50
"	చిత్తూరు	—	—
అక్కుళ్ళు:	విజయవాడ	31-13	41-50
"	తాడేపల్లిగూడెం	31-13	41-50
"	కాకినాడ	31-13	41-50
"	ఆముదాల వలస	—	—
సన్న కృష్ణకాటుకలు :			
"	తాడేపల్లిగూడెం	34-13	45-50
సన్నాలు :	ఆముదాలవలస	—	—
మొలకొలుకులు ·	నెల్లూరు	37-13	49-50
మిల్లు బియ్యం			100 కి
నెంబర్లు :	విజయవాడ		78-02
"	కాకినాడ		78-02
అక్కుళ్ళు :	విజయవాడ	కొత్తవి	65-82
"	తాడేపల్లి గూడెం	"	65-82
"	కాకినాడ	"	65-82
"	ఆముదాల వలస		—
సన్న కృష్ణకాటుకలు :			
"	తాడేపల్లి గూడెం		71-93
నంబర్లు :	చిత్తూరు		—
సన్నాలు :	ఆముదాలవలస		—
మొలకొలుకులు :	నెల్లూరు		78-02
వేరుశనగ			
కాయలు	విజయవాడ		147-82
"	నంద్యాల		165-50
"	ఆదోని		170-00
"	విజయనగరం		147-50
పప్పు	విజయవాడ		212-50
"	నంద్యాల		209-00
"	ఆదోని		216-00
"	విజయనగరం		228-00
నూనె	విజయవాడ		437-90
"	నంద్యాల		418-00
"	ఆదోని		450-00
"	విజయనగరం		451-11
అపరాలు			
కందులు :	విజయవాడ		94-00
"	గుంటూరు		96-00
"	ఆముదాలవలస		—
మినుములు :	విజయవాడ		144-00
"	గుంటూరు		150-00
"	ఆముదాలవలస		130-00
"	విశాఖపట్నం		122-00
పెసలు	విజయవాడ		123-00
"	గుంటూరు		127-00
"	ఆముదాలవలస		116-00
శనగలు :	విజయవాడ		140-00
జొన్నలు			
అనంతపురం	తెల్లవి		59-50
నంద్యాల	పచ్చవి		51-55
బెల్లం			
తునిలో	1 వ రకం		100-00
"	3 వ రకం		105-00
హిందూపురంలో	1 వ రకం		120-00
"	3 వ రకం		105-00
చిత్తూరులో	1 వ రకం		104-50
"	3 వ రకం		91-00
అనకాపల్లిలో	1 వ రకం		99-00
"	3 వ రకం		84-00
తాడేపల్లిగూడెం	1 వ రకం		111-00
	2 వ రకం		90-00
జీడిపప్పు			
వేటపాలెం	అమెరికన్ రకం		938-36
"	ఇండియన్		888-36
"	బద్దలు		722-72
"	ముక్కలు		540-90
మిర్చి			
జి. 2. ఒకటవ రకం	గుంటూరు		340-00
జి. రెండు రకం	"		330-00
జి. వ2 రకం 2. వర్గ			—
చింతపండు			
చిత్తూరులో			200-00
హిందుపురంలో	1 వ రకం		300-00
"	2 వ రకం		280-00
జంగారెడ్డిగూడెంలో			150-00
మదనపల్లి			255-00
నెయ్యి		పల్నాడు	దేశవాళీ
ఒంగోలులో		840-00	840-00
గుంటూరు		840-00	850-00
కొబ్బరికాయలు			
(వెయ్యింటికి ధరలు)		కొత్తవి :	పాతవి
విజయవాడ :		400-00	—
రాజమండ్రి		400-00	—
పాలకొల్లు :		370-00	400-00
పసుపు			
దుగ్గిరాలలో :	కొమ్ములు		127-50
"	కాన్పూరు		147-50
"	దుంపలు		115-50
కడపలో :	కొమ్ములు		123-00
"	దుంపలు		114-50
జనపనార			
విజయనగరం :	మొదటిరకం		104-49
	రెండవరకం		98-43
	మూడవరకం		88-41
ఆముదాలవలసలో :			
	మొదటిరకం		101-33
	రెండవరకం		91-66
	మూడవరకం		80-66

పశ్చిమబెంగాల్ జిల్లా పరిషత్తుల సవరణ చట్టం ఆమోదం

శాసనసభ వాయిదా

కలకత్తా, ఏప్రిల్ 7

1963 జిల్లా పరిషత్తుల చట్టానికి సవరణ బిల్లు, 1951 కలకత్తా మునిసిపల్ యాక్టు సవరణ బిల్లు అంగీకరించడంతో, పశ్చిమ బెంగాల్ శాసనసభ నేటి నుండి నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పై రెండు సవరణ బిల్లులకు ప్రతిపక్షం వ్యతిరేకత తెలియబరచలేదు.

జిల్లాపరిషత్తుల అధ్యక్ష, ఉపాధ్యక్షుల పైన కొద్ది మెజారిటీతో విశ్వాసరాహిత్య తీర్మానం ఆమోదింపబడినా, వారిని తొలగింపడానికి ప్రభుత్వానికి పై సవరణచట్టం అధికారం యిస్తుంది. ఇదివరకు చట్టం ప్రకారం నాల్గింట మూడువంతుల మెజారిటీ వస్తేగాని వారిని తొలగించడానికి వీలులేదు.

అధిక సంఖ్యాక సభ్యుల విశ్వాసాన్ని చూరగొనని అధ్యక్షునితొలగించడం సరియైన పద్ధతని బిల్లుపైజరిగిన చర్చకు నీటిపారుదల శాఖామంత్రి శ్రీ విశ్వనాథ ముఖర్జీ సమాధానం చెప్పారు. ఇంకా ఆ చట్టంలో లోపాలువున్నాయనీ, ప్రభుత్వం వాటినన్నిటినీ పరిశీలించి ప్రత్యామ్నాయ చట్టాన్ని తీసుకువస్తుందని కూడా ఆయన చెప్పారు.

కలకత్తా కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను క్రమబద్ధం చెయ్యడానికి అవసరమైన ఆదేశాలు యివ్వడానికి వీలుగా కలకత్తా మునిసిపల్ చట్టం ప్రభుత్వానికి అధికారం యిస్తుంది.

కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్ ఈ సంవత్సరం ఆమోదించిన బడ్జెటు అంచనాలలో జరిగిన మోసం మున్సిపాలిటీల నిర్వహణ చరిత్రలో ఎన్నడూ జరగలేదని స్థానిక స్వపరిపాలనామంత్రి శ్రీ సోమనాధ్ లాహిరి చెప్పారు. అప్పుడు అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వంకూడాఒకఆర్డినెన్సు ద్వారా కలకత్తా కార్పొరేషన్ బడ్జెటులో జరిగిన మోసాన్ని సరిచెయ్యాలని భావించిందనికూడా ఆయన అన్నారు.

జాతీయ విముక్తి సంఘటనే వియత్నాం ఏకైక ప్రజాప్రతినిధి

ఐదు ఆఫ్రికా దేశాల శిఖరాగ్రసభ స్పష్టీకరణ : సామ్రాజ్యవాద బలగాలు వైదొలగాలని డిమాండ్

కైరో, ఏప్రిల్ 8

వియత్నాం ప్రజల ప్రతినిధిగా జాతీయ విముక్తి సంఘటనను గుర్తించాలని నిన్న ఇక్కడ ముగిసిన ఆఫ్రికాదేశాల శిఖరాగ్రసభ తీర్మానించింది.

ఉత్తరవియత్నాంపై అమెరికా బాంబు దాడులను తక్షణం బేషరతుగా నిలుపుచేయాలనీ, దక్షిణ వియత్నాం నుండి "సామ్రాజ్యవాద బలగాలు" తక్షణం వైదొలగాలనీ ఈ సభ డిమాండ్ చేసింది.

ఈ శిఖరాగ్ర సభలో పాల్గొన్న ఐక్య అరబ్ రిపబ్లిక్, టాంజానియా, మారుటేనియా, ఆల్జీరియా అధ్యక్షులు, గినీ అధ్యక్ష ప్రతినిధి ఈ సభ ముగిసిన సందర్భంగా ఒక సంయుక్త ప్రకటన జారీచేస్తూ వియత్నాం శాంతి సంభాషణల్లో సంప్రదించవలసిన వియత్నాం ప్రజల ఏకైక ప్రతినిధి జాతీయ విముక్తి సంఘటనేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎట్టి శాంతి సంభాషణలు జరిగినా ప్రజాఐక్యసంఘటనకే వియత్నాం ప్రజల ప్రతినిధిగా ప్రాతినిధ్యం వుండాలని ప్రకటించారు.

వియత్నాం ప్రజలకు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకొనేందుకుగాను స్వయం నిర్ణయహక్కు వుండాలని ఉద్ఘాటించారు.

చిత్తూరుజిల్లా చేనేత సొసైటీ ఉద్యోగుల సమ్మె

తిరుపతి, ఏప్రిల్ 8

గత పదునాలుగు సంవత్సరములుగా ఎటువంటి బోనసులేని జీతములతో సతమతమవుతున్న ఆంధ్రచేనేత సహకార సంఘ ఉద్యోగులు 80 మంది చిత్తూరు జిల్లాలోనూ మద్రాసు రాష్ట్రములోను వున్న విక్రయశాలలన్ని మూసివేసి మార్చి 27 నుండి సమ్మెలో పాల్గొంటున్నారు.

సోంపేట తాలూకాలో అగ్నిప్రమాదం

సోంపేట, ఏప్రిల్ 8

శ్రీకాకుళంజిల్లా సోంపేట తాలూకా గొల్లకంచలిగ్రామంలో నిన్న అగ్నిప్రమాదం జరిగి 33 ఇండ్లు దగ్ధమైనాయి. ఈ ప్రమాదంలో మూడు పశువులు చనిపోయాయి. విత్తనాలగింజలూ, వ్యవసాయ పరికరాలూ ధ్వంసమైనాయి.

పరిశ్రమల మూసివేత, రిట్రెంచిమెంటు పరిశీలనకు నిపుణుల కమిటీ

త్రైపాక్షిక సమావేశంలో కార్మికుల, యజమానుల ప్రతినిధుల సూచన

కలకత్తా, ఏప్రిల్ 7

పశ్చిమబెంగాల్‌లోని పరిశ్రమలలోనుంచి కార్మికులను రిట్రెంచి చేయడం. లేఆఫ్‌లు ప్రకటించడం, పరిశ్రమల మూసివేత వగైరా వివిధ సమస్యల పరిశీలనకు ఒక నిపుణుల సంఘాన్ని నియమించవలసిందిగా నేడిక్కడ జరిగిన త్రైపాక్షిక సమావేశంలో కార్మికుల, పారిశ్రామికుల ప్రతినిధులు కోరారు. ముఖ్యమంత్రి శ్రీ అజయ్‌కుమార్ ముఖర్జీ అధ్యక్షతన సమావేశం జరిగింది.

రిట్రెంచిమెంటు, లే ఆఫ్‌లు, పరిశ్రమల మూసివేతపై ఒక సంవత్సరంవరకు మారటోరియం ప్రకటించాలని కార్మిక ప్రతినిధులు కోరినట్లు, మూడు మాసాలవరకు మాత్రమే అటువంటి మారటోరియం ప్రకటించాలనీ, ఆ సమయంలోనే నిపుణుల కమిటీ నివేదికను ప్రకటించాలనీ యజమానుల ప్రతినిధులు కోరినట్లు ఒక అధికార ప్రతినిధి తెలియజేశారు.

ఇటీవల జరుగుతున్న బైఠాయింపు సమ్మెలను న్యాయవిరుద్ధమైనవాటిగా ప్రకటించాలనికూడాయజమానులు ఒత్తిడిచేసినట్లు తెలియజేశారు.

ఢిల్లీలో జరిగే ముఖ్యమంత్రుల సమావేశానికి అజయ్‌ముఖర్జీ వెళ్ళివచ్చిన తరువాత, ఏప్రిల్ 13 నుండి, తిరిగి చర్చలు కొనసాగింపబడతాయి.

కార్మికుల - యజమానుల సంబంధాల్లో మామూలు పరిస్థితులు నెలకొల్పేలా చూడాలనీ, అప్పుడే కార్మికుల కోర్కెలను పరిశీలించడానికి వీలవుతుందనీ కార్మిక ప్రతినిధులు కోరారు.

ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో యజమానులు కార్మికుల - యజమానుల సంబంధాల్లో తమ పాత విధానాలను వదలి, నూతన దృక్పథాన్ని అలవరచుకోవాలని కూడా కార్మిక ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

1300 మంది ప్రభుత్వోద్యోగులపై అవినీతి ఆరోపణలు

నిఘాసంఘ నివేదిక వెల్లడి

కలకత్తా, ఏప్రిల్ 7

ప్రభుత్వోద్యోగుల్లో అవినీతిని అరికట్టడానికి ప్రాథమిక బాధ్యతను ఆయా శాఖల, ఆఫీసుల అధికారికివప్పగించాలనినేడు శాసనసభకు సమర్పింపబడిన పశ్చిమ బెంగాల్ నిఘాసంఘ నివేదికలో తెలియ జేయబడింది.

విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి శ్రీ యస్. దత్తుతో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం 1965 మార్చి 4 న ఏకవ్యక్తి నిఘా కమిషన్‌ను నియమించింది.

ప్రభుత్వోద్యోగుల్లోని అవినీతిని నిఘా సంఘం ఒక్కటే రూపుమావలేదని ఆ నివేదికలో తెలియజేయబడింది. ప్రభుత్వ అధికారులు అవినీతి చర్యలు ఎలా చేస్తున్నదీ, వాటిని ఏ విధంగా పరిష్కరించాలో ప్రభుత్వానికి సలహా యివ్వడమే నిఘా సంఘ కర్తవ్యమని తెలియజేశారు.

1965 ఫిబ్రవరి 22 నుండి డిసెంబరు 31 వరకు 1175 అవినీతి కేసులు నిఘా సంఘం దృష్టికి తీసుకురాబడ్డాయనీ. వాటితో 1300 మంది ప్రభుత్వోద్యోగులకు సంబంధం కలదనీ, వారిలో 278 మంది గెజిటెడ్ ఆఫీసర్లు, 1022 మంది నాన్‌గెజిటెడ్ ఆఫీసర్లు వున్నారనీ ఆ నివేదికలో తెలియజేయబడింది. వాటిలో 45 శాతం ఆరోపణలు నిర్దిష్టంగా లేవనీ, వాటిని కమీషన్ పరిశీలించలేదనీ తెలియజేసింది.

మిగతా కేసుల్లో 10 మంది గెజిటెడ్ ఆఫీసర్లతోసహా 29 మంది డిపార్టుమెంటల్‌గా శిక్షింపబడ్డారనీ, 180 కేసుల్లో సాక్ష్యంలేక పోవడంవల్ల కొన్ని వదలివేయడం, బదిలీలు చెయ్యడం జరిగిందనీ, కొంతమందికి హెచ్చరికలు చెయ్యబడ్డాయనీ తెలియ జేయబడింది. ఇంకా 281 కేసులు పరిశీలనలో వున్నాయి. ఏడు కేసులు విచారణలో వున్నాయి. 54 కేసుల్లో డిపార్టుమెంటల్‌గా చర్య తీసుకోవలసివుంది.

ఈశాన్యసరిహద్దు ఏజెన్సీ దర్యాప్తు కమిటీ నివేదిక

సెప్టెంబరునాటికి సంభవమని

రాజ్యసభలో శుక్లా జవాబు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

1962 లో ఈశాన్య సరిహద్దు ఏజెన్సీలో విమానాలద్వారా జరిగిన ఆహార సరఫరాల విషయంపై దర్యాప్తు జరుపుతున్న కమిటీ నివేదిక వచ్చే సెప్టెంబరు నాటికి అందుతుందని కేంద్ర హోం శాఖ స్టేట్ మంత్రి శ్రీ వి. సి. శుక్లా నేడు రాజ్యసభలో చెప్పారు.

పబ్లిక్ అకౌంట్సు కమిటీ సలహా ప్రకారం రక్షణ మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారుడు శ్రీ యం. కె. హరిహరన్ నాయకత్వాన 1966 లో ఈకమిటీనినియమించటం జరిగిందని ఆయన శ్రీ లోక్‌నాథ్ మిశ్రాకు సమాధానంగా చెప్పారు. కళింగ ఎయిర్ లైన్సుతో కుదుర్చుకొన్న ఒప్పందంలోని వివిధ అంశాలను అమలు పరచుటలో కాలంగడిచిపోయిన విషయాలను, దాని ఫలితంగా ప్రభుత్వం పొందిన నష్టాలను ఆ కమిటీ పరిశీలించుతుందని కూడా శ్రీ శుక్లా చెప్పారు.

వివిధ అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ 3 నెలల్లో నివేదికను సమర్పించమని కోరామనీ, అయితే కమిటీ కోరికపై కాలపరిమితి సెప్టెంబరు వరకు పొడిగించామన్నారు.

సూయజ్ కాల్వలో నౌకాయానానికి అంతరాయం

పోర్టుసయీద్, ఏప్రిల్ 8

సూయజ్ కాలువలో ఒక డ్రెడ్జర్ నౌక ప్రమాదం జరిగినదృష్ట్యా కాల్వలో నౌకాయానానికి నిన్న అంతరాయం కలిగింది.

తిరిగి సూయజ్ కాల్వలో నౌకాయానాలు మామూలుగా ఎప్పుడు ప్రారంభమయ్యేది యింకా తెలియరాలేదు.

EDUCATIONAL

"Account Test (Andhra-Pradesh) Questions/Answers & Summaries Are Available for Subordinate Officers Parts I; II; Executive Officers, P.W.D.; and Zillaparishad Tests. Apply
Account Test Institute,
Madras-8".

'హైకో' ఫ్యాబ్రిక్స్ 13వ చేనేత సప్తాహ సందర్భమున

[రు 1కి 10 పైసలు ప్రత్యేక తగ్గింపు]

ది 9-4-1967 నుండి 16-4-1967 వరకు

నిపుణులైన కళాకారుల అద్భుతమైన పనితనము, ఆకర్షణీయమైన రంగులలో అందమైన వస్త్రాలు, ఖ్యాతిగాంచిన టై అండ్ డై, గద్వాల చీరెలు తనుములు, నాణ్యమైన దోవతులు, షర్టింగులు, శాలువలు. మన్నికైన బెడ్ షీట్లు, హిమ్రూ శాలువలు, తువ్వాలలు.

జంట నగరాలలోని మా విక్రయ శాలలు

(1) నారాయణగూడ. (2) సుల్తాన్‌బజార్ నెం.1 (పచ్చపసీసువద్ద), (3)సుల్తాన్ బజార్ నెం 2 (దిల్‌షాద్‌టాకీస్‌ముందు), (4) చిక్కడపల్లి, (5) నాంపల్లి, (6) లకిడీకాపూల్, (7) సికింద్రాబాదు. మహాత్మాగాంధీరోడ్, పోలీస్‌స్టేషన్‌ముందు

మా ఇంటర్‌స్టేటు ఎంపోరియాలు :

(1) న్యూఢిల్లీ (కన్నాట్ సర్కస్, ఫోన్ నెం. 40975): (2) కరోల్‌బాగ్: (3) బొంబాయి (న్యూచర్నీరోడ్, ఫోన్ నెం. 356323): (4) అహమ్మదాబాద్ (రిలీఫ్ రోడ్): (5) కలకత్తా (కాళీఘాట్): (6) కటక్ (చౌదరి బజార్): (7) బర్హాంపూర్ (హనుమాన్ బజార్).

మహారాష్ట్ర, కర్ణాటక మరియు మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని
మా విక్రయశాలలను దర్శించండి !

హైద్రాబాదు కేంద్ర చేనేత సహకారసంఘం లిమిటెడ్,
నారాయణగూడ, హైద్రాబాదు.



సోల్ సెల్లింగ్ ఏజంట్సు
నాగి సేల్సు కార్పొరేషను.
177, జగన్నాథ్ శంకర్ సేఠ్‌రోడ్, బొంబాయి-4 బిఆర్



తెలుగు
వి. ఐ. లెనిన్ గ్రంథాలు

	పేజీలు	రు.
1. మార్క్స్, ఎంగిల్స్, మార్క్సిజం —వి. ఐ. లెనిన్	620	2-70
2. ఆసియా జాగృతి ...	118	0-75
3. సోషలిస్టుభావశాస్త్రంసంస్కృతి ...	96	0-25
4. శాంతియుత సహజీవనం ...	175	0-90

★

పోస్టేజి అదనం: ప్రతులకు:

విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ-2
విశాలాంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్‌బజారు, హైద్రాబాద్

ADMARK

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ఎడిటర్, ప్రింటర్. అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. ప్రధాన సంపాదకులు: ఏటుకూరు బలరామమూర్తి. ముద్రణ: స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్. విజయవాడ-4